Follow: @ANNTELUGU
24-09-2025
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 290 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



అట్టహాసంగా అవార్డుల
## ప్రదానోత్సవం

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డ్స్.. ఢిల్లీలో మెరిసిన తారలు
- మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం
- 'బలగం' సినిమాకు జాతీయ అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్
- ఉత్తమ నటులుగా అవార్డు అందుకున్న షారుఖ్, విక్రాంత్

వివరాలు 2లో

టూడే న్యూస్

### నల్గొండ కాంగ్రెస్ అడ్డా..



- ఆ లిల్లిపుట్ మళ్లీ గెల్వడు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్
- అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతా..

02

### శవ పేటికలకు కూడా జీఎస్టీ వేస్తారా?



- కొత్త జీఎస్టీతో రాష్ట్రానికి రూ.7000 కోట్ల నష్టం
- మీ చావు మీరు చావండి అన్న విధంగా కేంద్రం వ్యవహరిస్తోంది
- కేంద్ర ప్రభుత్వంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

02

### హైకోర్టుకు స్మితా సభర్వాల్



- పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై సవాల్
- ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్

02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,15,690 |
| 22 క్యారెట్ | 1,06,050 |
| సిల్వర్ (కేజీ) | 1,40,000 |



## తగ్గేదేలే అంటున్న గోల్డ్
### ఆల్ టైమ్ హై.. తులం రూ.1,12,750

**మహా, బిజినెస్ డెస్క్ :** బంగారం రేటు 'తగ్గేదేలే' అంటూ దూసుకుపోతోంది. మంగళవారం రోజు ఆల్ టైం హై కి గోల్డ్ రేటు పెరిగింది. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో తాజాగా 10 గ్రాముల బంగారం ధర రూ.520 మేర పెరిగి రూ.1,12,750కి చేరింది. ప్రపంచదేశాల్లో బంగారానికి పెరుగుతున్న డిమాండ్ వల్లే రేటు ఈ విధంగా పైపైకి పోతోంది. ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఆ దేశానికి చెందిన యూఎస్ ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీరేట్లను తగ్గిస్తుందనే అంచనాలు సైతం గోల్డ్ రేటు పెరుగుదలకు ఊతమిచ్చాయి.

స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 82,102.10 |
| నిఫ్టీ ↗ | 25,169.50 |

ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | ₹5.4 | ₹162 |
| హోల్ సేల్ గుడ్డు ధర | ₹5.4 | ₹162 |
| రిటైల్ గుడ్డు ధర | ₹5.72 | ₹171.72 |



# రామప్ప ఆలయమే స్ఫూర్తి

## మేడారం చరిత్రలో నవ శకం
### మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్ మాస్టర్ ప్లాన్

- మరో వెయ్యేళ్ళు నిలిచేలా సమ్మక్క సారలమ్మ గద్దెల పునఃనిర్మాణం
- మహాజాతరకు మళ్లీ వస్తా... ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం
- జాతీయపండుగగా కేంద్రం గుర్తించకుంటే.. అమ్మలే మీ సంగతి చూసుకుంటారు
- మేడారం ప్రగతికి సహకరించాలని కేంద్రానికి సీఎం విజ్ఞప్తి
- సీఎంకు ఘనస్వాగతం పలికిన గిరిజనులు.. ఇపుడు సీతక్క ప్రభుత్వంలో భాగస్వామి



**ములుగు, మహా :** రామప్ప ఆలయం స్ఫూర్తిగా మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల పునఃనిర్మాణం కూడా రాతి కట్టడాలతో నిర్మించాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాతి కట్టడమైతేనే సమ్మక్క సారలమ్మల కీర్తి మరో వెయ్యేళ్లు కూడా కనిపిస్తుందని అన్నారు. మాల వేసుకున్నంత అకుంఠిత దీక్ష వందరోజుల్లోనే పనులు పూర్తి చేయాలని అధికారయంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం మేడారంలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాశ్వతప్రాతిపదికన పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ను స్థానిక గిరిజనుల సమక్షంలో ఆవిష్కరించారు. అసలైన అభివృద్ధి అంటే గిరిజనుల జీవనస్థితి మెరుగుపరచడమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గిరిజనులకు అదనంగా 22 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని అని తెలిపారు.

మిగతా 2లో

## సీఎం రేవంత్ తులాభారం
### సమ్మక్కకు 68 కిలోల బెల్లం బంగారం.. మొక్కు చెల్లించుకున్న సీఎం



**ములుగు, మహా :** ములుగు జిల్లా మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. సీఎం రేవంత్ తులాభారం ద్వారా అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించారు. సీఎం రేవంత్ 68 కిలోల బరువు తూగడంతో 68 కిలోల బంగారం ( బెల్లం ) సమర్పించి ఆయన మొక్కు చెల్లించుకున్నారు. మేడారం ఆలయ అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ స్వయంగా సమీక్ష జరిపారు. మేడారం సమ్మక్క సారలమ్మల అభివృద్ధి కోసం రూ.236.2 కోట్లు ఖర్చు చేసి మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నారు.

బంగాళాఖాతంలో
# మరో వాయుగుండం
### తెలంగాణలో మరో ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు
### 26, 27న అతి భారీవర్షాలు



**హైదరాబాద్, మహా :** తెలంగాణకు రాబోయే వారం రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సెప్టెంబర్ 23, 24, 25న కొన్ని జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు..26,27 న భారీ వర్షాలతో పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల హెచ్చరికతో జిల్లా అధికారులను, యంత్రాంగంతో పాటు నగరంలోని అధికారులను జీహెచ్ఎంసీ, హైడ్రా, మాన్ సూన్, డీఆర్ఎఫ్ బృందాలను అలెర్ట్ చేసింది వాతావరణశాఖ.

**21 జిల్లాలకు ఎల్లో అలెర్ట్**

సెప్టెంబర్ 23న తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భూవనగిరి, రంగారెడ్డి హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

మిగతా 2లో

### ఇద్దరు అగ్రనేతలు.. విభిన్న నేపథ్యాలు

- కరీంనగర్ టు కారడవి.. ఒకే ఎన్ కౌంటర్‌లో..
- టీచర్.. లాయర్.. నక్సలైట్..
- సత్యనారాయణరెడ్డిపై 3 కోట్ల రివార్డు



03

## సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి డిజైన్లు విడుదల
### పూజారుల సూచనలతో నాగులమ్మ గద్దె నిర్మాణం

- 40 ఏళ్ళ తర్వాత ఆధునీకరణ పనులకు సీఎం రేవంత్ శ్రీకారం
- ఆలయ ప్రవేశమార్గంలో కళాతోరణం

02

# కార్ల అమ్మకాల్లో రికార్డులే.. రికార్డులు
### కళ్ళు తిరిగే అమ్మకాలతో కంపెనీలకు పండుగ.. ఒక్కరోజే లక్ష కార్లు

**ఢిల్లీ, మహా :** దేశంలో పండగల సీజన్ స్టార్ట్ అయింది. ఫస్ట్ దసరా...తర్వాత దీపావళి. ప్రజలకే కాదు..ఈ సారి కార్ల కంపెనీలకు కూడా ఇది పెద్ద పండగగా మారింది. జీఎస్టీ తగ్గింపుతో ఆఫర్లతో హోరెత్తించిన కార్ల కంపెనీలు.. అందుకు తగ్గట్టుగానే పండగ చేసుకున్నాయి. ఈ సారి జీఎస్టీ తగ్గింపుతో..మరింత చౌకగా కొత్త కారు అనే ప్రచారంతో జనం కార్ల షోరూంలకు ఎగబడ్డారు. 22వ తేదీ ఒక్క రోజే.. దేశ వ్యాప్తంగా.. మూడు కార్ల కంపెనీలు.. ఏకంగా 51 వేల కార్లను అమ్మాయి.. డెలివరీ చేశాయి అంటే.. ఇది రికార్డ్ అంటున్నాయి. జీఎస్ టి తగ్గింపుతో పాటు దేశంలో అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి వంటి కంపెనీలు ప్రత్యేక రాయితీలు కూడా ప్రకటించాయి. ఈ ప్రభావం నవరాత్రి ఉత్సవాల మొదటి రోజే కనిపించింది. ఈ రష్...ఈ అమ్మకాలు గత కొన్ని సంవత్సరాల్లో ఎప్పుడు నమోదు కాని రేంజ్ కు వెళ్లాయి.

మిగతా 2లో



## ఏ ప్రభుత్వాన్నైనా నిలదీస్తాం
### కృష్ణా జలాల్లో మనకు వాటా తప్పక రావాల్సిందే..

- తెలంగాణ జల హక్కులను కాపాడేందుకు ఎవరితోనైనా పోరాడుతాం
- కృష్ణా ట్రైబ్యునల్‌లో సమర్థమైన వాదనలు మళ్లీ వినిపిస్తాం: మంత్రి ఉత్తమ్

వివరాలు 2లో



# రామప్ప ఆలయమే స్ఫూర్తి



(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలపాటు గిరిజనులకు అన్యాయం జరిగిందని, తాము సరిదిద్దాలని భావించామని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం, పాలనలో గిరిజన బిడ్డలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. సమ్మక్కసారలమ్మ గద్దెల పునఃనిర్మాణం అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిధుల కోసం గతంలో సీతక్క ఇచ్చిన వినతిపత్రాలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు సీతక్క నిధులు ఇవ్వటం కాదు ఆ దస్త్రాలపై ఆమె సంతకం పెడుతోందని వెల్లడించారు. గతంలో అభివృద్ధి గురించి నేతలను అడగటమే గగనమైన పరిస్థితి ఉండేదని, నిధులు అడిగితే ఏదో భిక్షం ఇస్తున్నట్లు వ్యవహరించేవారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు, గోడలు మాత్రమే కాదన్న సీఎం రాతి కట్టడాలు కూడా వందల ఏళ్లు నిలబడి ఉంటాయని అన్నారు. మేడారం ఆలయ అభివృద్ధిపై స్థానికుల అభిప్రాయాలు తీసుకునేందుకే ఇక్కడికి వచ్చానని, 100 రోజుల్లో పనులు మొత్తం పూర్తయ్యేలా అధికారులు చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించామని, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, రాబోయే వందరోజులు నిష్ఠతో పనులు పూర్తి చేయాలని అన్నారు. మేడారం ఆలయ అభివృద్ధిపై సమీక్షించిన సీఎం గద్దెల విస్తరణ డిజైన్లను ఆవిష్కరించారు. ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు.

**కేంద్రం ఎందుకు నిధులు ఇవ్వట్లేదు?**

కుంభమేళాకు వేల కోట్లు ఇచ్చే కేంద్రప్రభుత్వం మేడారం జాతరకు ఎందుకు ఇవ్వట్లేదు? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలో ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆలయాలు మాత్రమే కాదు సమ్మక్కసారలమ్మ ఆలయం వైపు కూడా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని తెలిపారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు అని గుర్తుచేశారు. ఫిబ్రవరి 6, 2023న మేడారం నుంచే తన పాదయాత్ర మొదలుపెట్టానని రేవంత్ చెప్పారు. సమ్మక్కసారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని, శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**గద్దెల విస్తరణపై పూజారులతో సమీక్ష**

మేడారం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులు, పూజారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గద్దెల విస్తరణ, దేవస్థాన అభివృద్ధి ప్రణాళికలపై పూజారులతో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, పూజారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మార్పుల డిజైన్, గద్దెల విస్తరణకు తుది సూచనలు చేశారు. చర్చల అనంతరం అభివృద్ధి పనుల డిజిటల్ ప్లాన్‌ను సీఎం విడుదల చేశారు. సమీక్ష అనంతరం అక్కడే జరిగిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు. మహా జాతర నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వం సంకల్పించింది. ఈ పర్యటనలో సీఎంతో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి డిజైన్లు విడుదల

పూజారుల సూచనలతో నాగులమ్మ గద్దె నిర్మాణం.. 40 ఏళ్ళ తర్వాత ఆధునీకరణ పనులకు సీఎం రేవంత్ శ్రీకారం.. ఆలయ ప్రవేశమార్గంలో కళాతోరణం

**ములుగు, మహా :** మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభలో సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం డిజైన్లను విడుదల చేశారు. కొత్తగా రిలీజ్ చేసిన డిజైన్ లో ఆలయంలో ముందుగా ప్రవేశ మార్గంలో కళాతోరణం ఉంది. లోపల సమ్మక్క,సారక్క దేవతలు కొలువుదీరిన గద్దెల ప్రాంగణంలోనే ఒకే వరుసలో గద్దెల పగిడిద్దరాజు గోవిందరాజు, ప్రతి రూపాలకు గద్దెలు నిర్మించనున్నారు. పూజారుల సూచనలతో నాగులమ్మ గద్దె నిర్మాణం చేయనున్నారు. దీనిద్వారా జాప్యం లేకుండా అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుంది. జాతర టైంలో సులభంగా గద్దెల దగ్గరకు చేరుకోవడానికి 4 వైపులా క్యూ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. 1986 తర్వాత మేడారం గద్దెల ప్రాంగణం ఆధునీకరణ జరగనుంది. గద్దెల అభివృద్ధికి రూ.58.2 కోట్లు, గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ.6.8 కోట్లు, జంపన్న వాగు అభివృద్ధి కోసం రూ.39 కోట్లు, భక్తుల వసతి కోసం రూ.50 కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ.52.5 కోట్లు, మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం వెచ్చించనుంది ప్రభుత్వం. మేడారం అభివృద్ధిలో పూజారులను భాగస్వాములను చేయనుంది ప్రభుత్వం. మహా జాతరకు ప్రజా ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ హామీనిచ్చారు. నాలుగుదశాబ్దాల తర్వాత ఆలయ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం రేవంత్ కే దక్కుతుంది.

# శవ పేటికలకు కూడా జీఎస్టీ వేస్తారా?

## కొత్త జీఎస్టీతో రాష్ట్రానికి రూ. 7000 కోట్ల నష్టం

మీ చావు మీరు చావండి అన్న విధంగా కేంద్రం వ్యవహరిస్తోంది

కేంద్ర ప్రభుత్వంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



**హైదరాబాద్, మహా:** కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 ఏళ్లుగా బీజేపీ ప్రజలను దోచుకుందని, కేంద్ర ప్రభుత్వం ఇన్ని రోజులు పేద ప్రజల రక్తం తాగిందని విమర్శించారు. జీఎస్టీతో పేదలకు లబ్ధి చేసినట్టు బీజేపీ నాయకులు బిల్డప్ ఇస్తున్నారు, జీఎస్టీ అంటే గబ్బర్ సింగ్ టాక్స్ అని మొదటి నుంచి చెప్తున్నామన్నారు. మంగళవారం మంత్రి పొన్నం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పేదలను దోచుకోవడానికే కేంద్రంలోని బీజేపీ పెద్దలు జీఎస్టీ తీసుకువచ్చారని మండిపడ్డారు. శవ పేటికలపై, పసి పిల్లల తినుబండారాలపై కూడా జీఎస్టీ వేశారని విమర్శించారు. జీఎస్టీతో ఏదైనా మంచిపని చేశారా అని మంత్రి ప్రశ్నించారు. ఆర్థిక సంక్షోభం నుంచి తప్పించుకోవడానికే మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. తెలంగాణకు 7 వేల కోట్ల నష్టం వస్తోంది. దీన్ని పూడ్చే బాధ్యత కేంద్రానిదేనని అన్నారు. తెలంగాణ ఎంపీలు, కేంద్ర మంత్రి సంజయ్, కిషన్ రెడ్డి లు తెలంగాణకి వస్తున్న నష్టాన్ని ఎలా పుడుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం పెద్దన్న పాత్ర పోషించి అండగా ఉండాలని సూచించారు.

**ఆ సొమ్ముపై జీఎస్టీ తీసేయాలని విజ్ఞప్తి..**

పెట్రోల్, డీజిల్ జీఎస్టీలో చేర్చాలని తద్వారా పన్ను రేటు తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందని చాలా రాష్ట్రాలు విజ్ఞప్తి చేశాయి.. ఇప్పటి వరకు పెట్రోల్ డీజిల్ జీఎస్టీ పరిధిలోకి తేలేదని అన్నారు. మీరు శవ పేటికలకు కూడా జీఎస్టీ వేశారు, శవాలను దహనం చేసే సమయంలో చెల్లించే సొమ్ముపై జీఎస్టీ తీసేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం కొత్త జీఎస్టీ వల్ల ప్రతి సంవత్సరం 7000 కోట్ల రూపాయలు నష్టపోతుంది, రాష్ట్రాలు నష్టపోతున్న దానిని కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. జీఎస్టీ తగ్గించి కేంద్ర ప్రభుత్వం మీ చావు మీరు చావండి అన్న విధంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. సంక్షేమం మొత్తం రాష్ట్రాల మీద రుద్దుతున్నారు.. కేంద్ర ప్రభుత్వ మాత్రం సెస్‌ల పేరుతో దండుకుంటున్నారని ఆరోపించారు. జీఎస్టీ తీసుకొచ్చినప్పుడు 10 సంవత్సరాల పాటు రాష్ట్రాల నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది అని చెప్పారు.. కానీ పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదని అన్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం నష్టపోతున్న 7 వేల కోట్ల రూపాయల పై మాకు ఎంత ఇస్తారో ప్రామిస్ చేయాలన్నారు. రాష్ట్రాలు నష్టపోతున్న దానిపై తెలంగాణలోని కేంద్ర మంత్రుల కిషన్ రెడ్డి ,బండి సంజయ్ లు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడించాలి..మీరు కేంద్రం నుండి స్పష్టత ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# హైకోర్టుకు స్మితా సభర్వాల్

పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై సవాల్

ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్



**హైదరాబాద్, మహా:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీవల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్‌తోపాటు అక్టోబరు 7కి హైకోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# నల్గొండ కాంగ్రెస్ అడ్డా.. ఆ లిల్లిపుట్ మళ్లీ గెల్వడు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్

అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతా..



**నల్గొండ, మహా:** నల్లగొండ గడ్డ అంటేనే కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కండువా మోసే నిఖార్సైన కార్యకర్తలే పార్టీకి బలమని, మీరే నా లీడర్లు, మీరే నా క్యాడర్లు, మీరే నా బలం, బలగమని ఆయన తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమయంలోనైనా తోడుగా నా వెన్నంటే ఉంటూ 30 ఏళ్లుగా నన్ను అక్కున చేర్చుకున్నారని, ఏమిచ్చినా మీ రుణం తీర్చలేనిదని కోమటిరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేర్చే బాధ్యత మీదేనని అన్నారు.

**కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే అభివృద్ధి..**

గ్రామీణ రోడ్లు అన్నింటినీ డబుల్ రోడ్లుగా మారుస్తా.. విద్యా, వైద్యంలో ఇంకా మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. రోడ్లు, కాలువలు, కాలేజీలు, హాస్పిటల్స్, ప్రాజెక్టులు ఏది చూసినా నల్లగొండ మోడల్ అనేలా చేస్తానని మాటిస్తున్నానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా 100శాతం కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది.. అది మునిగిపోయే నావా అని నేను ఎప్పుడో చెప్పానన్నారు. ఈ జిల్లాలో ఓ లిల్లీపుట్ ఉన్నాడు, ఎప్పుడూ గెలిచిన రెండు వేల లోపు మెజార్టీనేనని ఇక మళ్ళీ గెలవడని మాజీ మంత్రి జగదీష్ రెడ్డని ఉద్దేశించి మంత్రి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైతుందని మంత్రి వెల్లడించారు.

# ఏ ప్రభుత్వాన్నైనా నిలదీస్తాం..

## కృష్ణా జలాల్లో మనకు వాటా తప్పక రావాల్సిందే..

**తెలంగాణ జల హక్కులను కాపాడేందుకు ఎవరితోనైనా పోరాడుతాం**

**కృష్ణా ట్రైబ్యునల్‌లో సమర్థమైన వాదనలు మళ్లీ వినిపిస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ఢిల్లీ, మహా:** కృష్ణా జలాల అంశంలో తెలంగాణకు కేటాయించాల్సిన వాటా గురించి ఢిల్లీలోని కృష్ణా ట్రిబ్యునల్ ముందు వాదనలు జరిగాయి. కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదించారు. పాత కేటాయింపుల ప్రకారం ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీల కేటాయింపు జరిగింది. అయితే బేసిన్ ఏరియా, జనాభా, సాగుభూమి ఆధారంగా 70 శాతం కేటాయింపు రావాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. కృష్ణా నుంచి 555 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ నుంచి 45 టీఎంసీలు కలిపి మొత్తం 763 టీఎంసీలు కావాలని తెలంగాణ స్పష్టంగా వాదించింది. దీనితోపాటు కర్ణాటకలో ప్రాజెక్టుల ఎత్తు పెంచకూడదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాల కోసం న్యాయపోరాటం కొనసాగిస్తామని, కృష్ణా-గోదావరి జలాల్లో న్యాయం సాధించడమే లక్ష్యమని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచే అంశాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్టును కూడా ఆశ్రయిస్తామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్, ఏపీలో టీడీపీ, మహారాష్ట్రలో బీజేపీ ఎక్కడ ఏ ప్రభుత్వం ఉన్నా తెలంగాణ వాటా విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో మా వాటా కోసం రాజీలేని పోరాటం ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రేపు, ఎల్లుండి రోజులపాటు తెలంగాణ వాదన వినిపించనుందని తెలిపారు. తెలంగాణ తరపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో కృష్ణ ట్రిబ్యునల్ ముందు వాదన వినిపించే విషయంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో బ్రీఫింగ్ జరిగిందని అన్నారు. కృష్ణా నది జలాల్లో రావాల్సిన వాటా పై వాదనలు వినిపిస్తున్నామన్నారు. అండర్ సెక్షన్ 3 రిఫరెన్స్ పై ప్రస్తుతం విచారణ జరుగుతుందన్నారు. ఫిబ్రవరి నుంచి వాదనలు వినిపిస్తున్నాం, ప్రస్తుతం తెలంగాణ తుది వాదనలను వినిపిస్తుందన్నారు. తెలంగాణలో కృష్ణ ప్రవాహం, క్యాచ్ మెంట్ ఏరియా.. పాపులేషన్ వీటన్నిటిని పరిగణలోకి తీసుకుని మా వాటా నిర్ణయించాలన్నారు. 70 శాతం నీటి వాటా కేటాయించాలని కోరుతున్నామన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మేం ఏకీభవించడం లేదన్నారు. అందుకే ఫైల్ రీఓపెన్ చేసి మొదటినుంచి వాదనలను వినిపిస్తున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

# కార్ల అమ్మకాల్లో రికార్డులే.. రికార్డులు

## కళ్ళు తిరిగే అమ్మకాలతో కంపెనీలకు పండుగ.. ఒక్కరోజే లక్ష కార్లు

(మొదటిపేజీ తరువాయి)

మారుతి సుజుకి ఇండియా కు ఫస్ట్ డే ఎనభై వేల ఎంక్వయిరీ లు రాగా..తొలిరోజు 30000 కార్ల డెలివరీలు జరిగాయి. అదే సమయంలో కొత్త బుకింగ్స్ కూడా గతంతో పోలితే చాలా ఎక్కువ గా నమోదు అవుతున్నాయి.

**కళ్ళు తిరిగే అమ్మకాలు**

దేశంలో నవరాత్రి తొలిరోజు కార్ల అమ్మకాల నంబర్లు చూస్తుంటే కళ్లు తిరిగి పోతున్నాయి. చాలా కంపెనీలు మూడు నుంచి ఆరు నెలల కాలంలో అమ్మే కార్లను కేవలం తొలిరోజే అమ్మటంతో జీఎస్టీ 2.0 తగ్గింపులు పెద్ద సక్సెస్ అని తెలుస్తోంది. ముందుగా దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ సెప్టెంబర్ 22 ఒక్కరోజే 30వేల కార్లను విక్రయించి రికార్డు సృష్టించింది. ఇదే సమయంలో కస్టమర్ల నుంచి కొనుగోలు కోసం 80వేల ఎంక్వైరీలు వచ్చినట్లు కంపెనీ ప్రకటించింది. ఇదే సమయంలో మరో ఆటో దిగ్గజ సంస్థ హుందాయ్ సెప్టెంబర్ 22న 11వేల కార్లను విక్రయించింది. దీంతో గడచిన 5 ఏళ్ల కాలంలో ఒక్కరోజులోనే అత్యధిక సంఖ్యలో కార్లను అమ్మిన ఏకైక సింగిల్ డే రికార్డు ను కంపెనీలో నమోదైంది. ఇదే సమయంలో టాటా మోటార్స్ కంపెనీ కూడా సోమవారం ఒక్కరోజునే 10వేల కార్లను అమ్మేసింది. చిన్న బడ్జెట్ కార్ల నుంచి భారీ లగ్జరీ కార్ల వరకు అమ్మకాలతో కంపెనీలు రికార్డు సేల్స్ ఈ నవరాత్రికి చూశాయి. . ఇక ఇదే క్రమంలో ఇతర పెద్ద ఆటో సంస్థలైన మహీంద్రా, కియాతోపాటు మిగతా కార్ల కంపెనీలు తమ డేటాను ఇంకా ప్రకటించలేదు. ప్రధానంగా చిన్న కార్లకు డిమాండ్ భారీగా పెరిగిందని ఆటో సంస్థలు చెబుతున్నాయి. చిన్న కార్ల ఆర్డర్లు 50 శాతం పెరిగాయి. కంపెనీలు కూడా తాము పొందిన జీఎస్టీ తగ్గింపును పూర్తిగా కారు కొనేవారికి పాస్ చేస్తుండటంతో కొత్త జోష్ కనిపించింది. చాలా మోడళ్లపై లక్ష నుంచి 3 లక్షల వరకు తగ్గింపులను కంపెనీలు ఆఫర్ చేయటంతో నిమిషాల్లో కార్లు షోరూమ్స్ నుంచి బిల్లింగ్ అయ్యిమాయమయ్యాయి. తొలిరోజు ఈ కార్ల అమ్మకాలు పెద్ద ఎత్తున ఉండటంతో స్టాక్ మార్కెట్ లో మంగళవారం ఉదయమే మారుతి తో పాటు హ్యుండయ్ ఇండియా షేర్లు కూడా మంచి లాభాలతో ట్రేడ్ అవుతున్నాయి. మొత్తం మీద ఆటోమొబైల్ కంపెనీలు అన్ని లాభాల బాటలో సాగుతున్నాయి.

# అట్టహాసంగా అవార్డుల ప్రదానోత్సవం

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డ్స్.. ఢిల్లీలో మెరిసిన తారలు

- మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం
- ‘బలగం’ సినిమాకు జాతీయ అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్
- ఉత్తమ నటులుగా అవార్డు అందుకున్న షారుఖ్, విక్రాంత్.

**ఢిల్లీ, మహా:** 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అట్టహాసంగా జరిగింది. 2023 సంవత్సరానికి గాను భారతీయ సినిమాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ ఏడాది ఉత్తమ నటుడి పురస్కారాన్ని బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్, విలక్షణ నటుడు విక్రాంత్ మస్సే సంయుక్తంగా గెలుచుకున్నారు. పాన్‌ఇండియా చిత్రం 'జవాన్'లో అద్భుత నటనకు షారుఖ్ ఖాన్‌కు, '12th ఫెయిల్' చిత్రంలో అసాధారణ నటనకు విక్రాంత్ మస్సేకు రజత కమలం లభించింది. విశేషమేమిటంటే, వీరిద్దరికీ ఇదే తొలి జాతీయ అవార్డు కావడం గమనార్హం. మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో షారుఖ్ ఖాన్ జాతీయ అవార్డు అందుకోవడం ఇదే మొదటిసారి. భారతదేశంలో 'కింగ్ ఆఫ్ బాలీవుడ్'గా పేరుగాంచిన షారుఖ్, 80కి పైగా చిత్రాలలో నటించి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన ఇప్పటికే పద్మశ్రీ, ఫ్రాన్స్‌కు చెందిన చెవాలియర్ డి లా లెజియన్ డి 'హొన్నూర్ వంటి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఇక విక్రాంత్ మస్సే సైతం టీవీ రంగం నుంచి వచ్చి 'ఏ డెత్ ఇన్ ది గంజ్', 'ఛపాక్', 'మీర్జాపూర్' వంటి వెబ్ సిరీస్‌లతో తన నటనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**టాలీవుడ్ నుంచి..**

టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా ‘భగవంత్ కేసరి’ ఎంపిక కాగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి పురస్కారాలు అందుకున్నారు. సాయి రాజేశ్ (ఉత్తమ స్క్రీన్‌ప్లే బేబీ సినిమా), పీవీఎన్ఎస్ రోహిత్ (ఉత్తమ నేపథ్య గాయకుడు బేబీ మూవీ), ప్రశాంత్ వర్మ (హనుమాన్ సినిమా.. బెస్ట్ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్) హర్షవర్ధన్ రామేశ్వర్ (ఉత్తమ నేపథ్య సంగీతం యానిమల్ మూవీ), సుకృతి వేణి (ఉత్తమ బాల నటి గాంధీతాత చెట్టు) కాసర్ల శ్యామ్ (ఉత్తమ గేయ రచయిత బలగం) తదితరులు అవార్డులు పొందారు.



**మోహన్‌లాల్‌కు దేశంలోనే అత్యున్నత సినీ పురస్కారమైన..**

ఈ వేడుకలో భారతీయ సినిమాకు చేసిన సేవలకు గాను, మలయాళ సినీ దిగ్గజం మోహన్‌లాల్‌కు దేశంలోనే అత్యున్నత సినీ పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా మలయాళ చిత్ర పరిశ్రమలో తన అద్భుత నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న మోహన్‌లాల్‌ను కేరళలో అభిమానులు 'లాలెట్టన్' అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. ఆయన 350కి పైగా చిత్రాలలో నటించి, ఐదు జాతీయ అవార్డులతో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆయన కెరీర్‌లో 'రాజావింటే మకన్', 'కిరీడం', 'భారతం', 'వానప్రస్థం' వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఫీచర్ ఫిల్మ్ కేటగిరీ జ్యూరీ చైర్మన్, ప్రముఖ దర్శకనిర్మాత అశుతోష్ గోవారికర్, రచయిత గోపాలకృష్ణ పాయ్, దర్శకుడు పి. శేషాద్రి వంటి ప్రముఖులు హాజరయ్యారు. 2023 సంవత్సరానికి సంబంధించిన ఈ అవార్డులను ఆగస్టు 1, 2025న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే.

# బంగాళాఖాతంలో మరో వాయుగుండం

## తెలంగాణలో మరో ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 3040 కి. మీ)తో కూడిన వర్షాలు అన్ని జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. సెప్టెంబర్ 24 వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 25 నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతం దాని సమీపంలోని ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉంది. సెప్టెంబర్ 26వ నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. తదుపరి ఈ వాయుగుండం దక్షిణ ఒడిస్సా ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో సెప్టెంబర్ 27 నాటికి తీరాన్ని దాటే అవకాశం ఉంది. దీంతో 26, 27 న భారీ వర్షాలతో పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# ఇద్దరు అగ్రనేతలు.. విభిన్న నేపథ్యాలు

## కరీంనగర్ టు కారడవి.. ఒకే ఎన్ కౌంటర్‌లో..

## టీచర్.. లాయర్.. నక్సలైట్.. సత్యనారాయణరెడ్డిపై 3 కోట్ల రివార్డు

**కరీంనగర్, మహా :** ఇద్దరు నేతలు.. విభిన్న నేపథ్యాలు. టీచర్ ఉద్యోగం వదిలి ఒకరు.. కార్మిక నేపథ్యం నుండి మరొకరు నక్సలిజం వైపు ఆకర్షితులై నాలుగుదశాబ్దాల అలుపెరుగని ప్రయాణం తర్వాత ఎన్ కౌంటర్ లో మరణించారు. మావోయిస్టు పార్టీకి ఇది కోలుకోలేని దెబ్బే. ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర కమిటీ(సీసీ) సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి (రాజుదాదా, వికల్ప్, ఉసెండీ) (63), కడారి సత్యనారాయణ రెడ్డి (కోసాదాదా, గోపన్న, బుచ్చన్న) (67) మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా వీరిద్దరిదీ తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కావడం గమనార్హం. రెడ్డి సామాజిక వర్గంలో పుట్టినప్పటికీ సమసమాజ స్థాపనే లక్ష్యంగా మావోయిస్టు పార్టీలో చేరిన ఈ ఇద్దరు నేతలు ఒకే ఎన్‌కౌంటర్లో ఒకేసారి మరణించడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బగానే పేర్కొనవచ్చు.

**టీచర్ .. లాయర్.. ఆ తర్వాత**

ఉపాధ్యాయుడిగా ఉన్నత స్థానంలో ఉన్న కట్టా రామచంద్రారెడ్డి పీడిత ప్రజల కోసం టీచర్ కొలువు వదిలి చివరివరకు ఉద్యమంలో కొనసాగారు. రామచంద్రారెడ్డి కోహెడలో పది, సిద్ధిపేటలో డిగ్రీ వరకు చదివి వరంగల్‌లో టీటీసీ పూర్తి చేశారు. తర్వాత పెంచికలపేట్‌లో ఎస్జీటీగా ఉద్యోగంలో చేరారు.ఎందరో విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఆయన సమాజంలోని అసమానతలను చక్కదిద్దడమే తన కర్తవ్యంగా భావించి అడవి బాట పట్టారు. మూడున్నర దశాబ్దాల పాటు అజ్ఞాతంలోనే గడిపి అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాశారు. రాజు దాదా, గుడ్సా ఉసెండీ, విజయ్, వికల్ప్ తదితర పేర్లతో కొనసాగిన కట్టా రామచంద్రారెడ్డి స్వస్థలం కరీంనగర్ జిల్లా కోహెడ మండలంలోని తీగలకుంటపల్లి. ఆయన తల్లిదండ్రులు కట్టా వజ్రవ్వ, మల్లారెడ్డి. తండ్రి 97 ఏళ్ల వయసులో ఉండగా... తల్లి వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. రామచంద్రారెడ్డి.. భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఆ సమయంలోనే శాంతి అనే మహిళను కులాంతర వివాహం చేసుకున్నారాయన. 1989లో విప్లవోద్యమానికి ఆకర్షితులైన ఆయన తన భార్యతో కలిసి అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. ఉపాధ్యాయుడిగా చేస్తూనే ఆయన న్యాయవిద్య అభ్యసించినట్లు తెలుస్తోంది.



సత్యనారాయణరెడ్డి



రామచంద్రారెడ్డి

న్యాయవిద్యపై ఆసక్తితో రాంచంద్రారెడ్డి నాందేడ్ వెళ్లినట్లు చెబుతారు. అక్కడ పీపుల్స్‌వార్‌గ్రూప్(పీడబ్ల్యూజీ)కు న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తూ ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లారు. తొలుత తన భార్యతో కలిసి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ డెన్ కీపర్‌గా పనిచేసిన ఆయన ఆ తర్వాత రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. అనంతరం దండకారణ్యం ప్రత్యేక జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) అధికార ప్రతినిధిగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా కూడా పనిచేశారు. 2020లో డీకేఎస్‌జడ్‌సీ బాధ్యతలను చేపట్టారు. ఆయన భార్య శాంతిప్రియను 2008 జనవరి 22న పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆమె... శిక్ష పూర్తి చేసుకొని మూడేళ్ల క్రితం ఆమె విడుదలయ్యారు. వారి కుమారుడు దంత వైద్యుడిగా, కుమార్తె సీఏగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం పిల్లలతో కలిసి ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది. రామచంద్రారెడ్డి.. కొన్నేళ్ల క్రితమే పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనపై ప్రభుత్వం రూ.40లక్షల రివార్డు ప్రకటించింది.

**కార్మిక ఉద్యమం నుంచి కారడవిలోకి...**

ఇక మావోయిస్టు పార్టీలో మరో కేంద్ర కమిటీ సభ్యుడుగా ఉన్న కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస అలియాస్ గోపన్న అలియాస్ సాధు స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి. ఆయన తల్లిదండ్రులు కడారి అన్నమ్మ, కృష్ణారెడ్డి. తండ్రి కిష్టారెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అమ్మ అన్నమ్మ గృహిణి. వీరిద్దరూ పదేళ్ల క్రితమే మృతి చెందారు. 1955లో జన్మించిన సత్యనారాయణ ఎల్లారెడ్డిపేటలో 10వ తరగతి వరకు చదివారు. ఆ తర్వాత పెద్దపల్లిలో ఐటీఐ చదువుతుండగా(197577 మధ్య) ర్యాడికల్ విద్యార్థి ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. అనంతరం రామగుండంలోని కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌షిప్ చేశారు. అప్పుడు కర్మాగారంలో జరిగిన గొడవల్లో మేనేజర్ హత్యకు గురికాగా ఆయనను అరెస్ట్ చేశారు. విడుదలయిన అనంతరం ఆయన పీపుల్స్‌వార్ అనుబంధ సికాసలో కొంతకాలం పనిచేశారు అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లారు. అదే సమయంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు(కిషన్‌జీ) సూచనతో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. గెరిల్లా యుద్ధ నిపుణుడిగా పేరు పొందిన కోస... దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా, మిలిటరీ కమాండర్‌గా, సెంట్రల్ కమిటీ సభ్యుడిగా వివిధ హోదాల్లో పని చేశారు. 1980లో ఉగాది పండుగ నాడు గోపాల్‌రావుపల్లికి వచ్చి కుటుంబ సభ్యులను కలిసిన కోస.. ఆ తర్వాత మళ్లీ ఇటువైపు కన్నెత్తి చూడలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అదే సమయంలో తన ఆనవాళ్లు దొరకకుండా ఉండేందుకు అప్పట్లోనే తన ఫొటోలు, సర్టిఫికెట్లు తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. పార్టీలో నే 1984లో రాధను వివాహం చేసుకున్నారు. కాగా సత్యనారాయణ రెడ్డి సోదరుడు కరుణాకర్ రెడ్డి ఎంఇవోగా రిటైరయ్యారు. కాగా సత్యనారాయణ రెడ్డి తలపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు రూ.3 కోట్ల రివార్డును ప్రకటించాయి.



# బాలయ్యను కలిసిన మంత్రి కొండపల్లి

## జాతీయ అవార్డుపై హర్షం.. అభినందనలు

**అమరావతి, మహా:** మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మంత్రి ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.. ఇటీవల ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఆయన నటించిన 'భగవంత్ కేసరి'కి అవార్డు రావడంతోపాటు, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిన సందర్భంగా బాలకృష్ణకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలపడంతో పాటు రికార్డులు.. అభిమానుల రివార్డులు బాలయ్యకే సాధ్యమన్నారు. భారతీయ చిత్రపరిశ్రమలో బాలయ్య ప్రత్యేకమన్నారు.

# డీసీసీలపై ఏఐసీసీ కసరత్తు

## జాతీయ స్థాయి నేతల నియామకం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ డీసీసీ ల నియామకాలకు జాతీయ స్థాయిలో సీనియర్ నాయకులను ఏఐసీసీ నియమించింది. డీసీసీల నియామకాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అధిష్టానం తీసుకుంది. ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవడానికి ఏఐసీసీ లో సీనియర్ నాయకులను ఇంచార్జ్ లుగా ఏఐసీసీ నియమించింది. మాజీ ముఖ్యమంత్రి, సీడబ్ల్యుసి సభ్యులు, మాజీ కేంద్ర మంత్రులు, స్పీకర్ గా పని చేసిన వారిని తెలంగాణ డీసీసీ ల నియామకాలకు ఇంచార్జ్ లుగా వేయడం ద్వారా డీసీసీ నియామకాల ఏఐసీసీ ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. దీంతో డీసీసీల నియామకాలు ఎంత పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా, ఎలాంటి ఒత్తిడి లేకుండా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చని పీసీసీ వర్గాలు అంటున్నాయి. డీసీసీ లకు భవిష్యత్ లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వనుండడంతో డీసీసీ లకు డిమాండ్ పెరిగింది.

# సీఎం రేవంత్‌ను కలిసిన వనపర్తి ఎమ్మెల్యే

## మేఘా రెడ్డి వినతులకు సీఎం సానుకూలం.. పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణకు హామీ

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డిని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మంగళవారం కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పలు గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో అందుకు సానుకూలంగా స్పందించారు. వనపర్తి లోని విద్యాసంస్థలన్నింటికీ సొంత భవనాల నిర్మాణానికి అనుమతులు ఇస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, పాలిటెక్నిక్ కళాశాల వెనుక గల వసతి గృహాల అభివృద్ధి, పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల సొంత భవన నిర్మాణం, వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల సొంత భవన నిర్మానం, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల



సొంత భవన నిర్మాణంతో పాటు మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల సొంత భవన నిర్మాణాలకు త్వరలోనే జీవోలు జారీ చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వనపర్తి ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.



# స్థానిక ఎన్నికలపై సుప్రీం స్టే!

## ములుగు జిల్లా 23 గ్రామాల ఎన్నికలపై మధ్యంతర ఉత్తర్వులు

**ఢిల్లీ, మహా:** ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించడంపై ఆయా గ్రామాల గిరిజనేతరులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కన పెట్టి.. నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# గ్రూప్-1 తీర్పుపై హైకోర్టులో మరోసారి అప్పీల్ దాఖలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్1 నియామకాలపై కొనసాగుతున్న వివాదంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీలు చేసిన నేపథ్యంలో, తాజాగా గ్రూప్1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని ఆశ్రయించారు. మార్చి 10న విడుదలైన గ్రూప్1 ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పలు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. వీటిని పరిశీలించిన హైకోర్టు సింగిల్ బెంచ్ జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, ఈ నెల 9న కీలక తీర్పు ఇచ్చారు. ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టు, మార్కుల జాబితాను రద్దు చేశారు. ఈ తీర్పుతో నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ వాదనలను సరైన విధంగా పరిగణలోకి తీసుకోలేదని పేర్కొంటూ డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేసింది. ఫలితాలు సక్రమంగానే ఉన్నాయని, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు అమలులోకి వస్తే నియామక ప్రక్రియ మరింత ఆలస్యమవుతుందని టీజీపీఎస్సీ వాదిస్తోంది. తాజాగా, గ్రూప్1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి కూడా సింగిల్ బెంచ్ తీర్పును వ్యతిరేకిస్తూ అప్పీల్ దాఖలు చేశారు. తన నియామకం చట్టబద్ధమని, ఇప్పటికే పొందిన హక్కును కోర్టు తీర్పుతో రద్దు చేయరాదని పిటిషనర్ వాదించారు. ఈ పిటిషన్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఒకవైపు టీజీపీఎస్సీ, మరోవైపు ఎంపికైన అభ్యర్థి చేసిన అప్పీల్స్‌తో గ్రూప్1 వివాదం మరింత క్లిష్టంగా మారింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఏ తీర్పు ఇస్తుందో అన్నది రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులలో ఆసక్తిని రేపుతోంది. ఈ కేసు తుది పరిష్కారం వచ్చేంతవరకు నియామకాలు నిలిచిపోవడం ఖాయమని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# ఆల్మట్టి ఆపకపోతే తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం

## కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యాస కాంట్రాక్టులు, కమీషన్ల పైనే ఉంది

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు 524 మీటర్లకు పెంచాలనుకోవడం దక్షిణ తెలంగాణ తీవ్ర నష్టం కలుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ అక్కడి ప్రభుత్వం భూ సేకరణ చేపట్టడం డ్యామ్ ఎత్తును పెంచే ప్రయత్నమేనని మండిపడ్డారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను రక్షించడానికి, రైతులకు అన్యాయం జరగకుండా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రాన్ని రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును ఆపకపోతే, దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచాలనే కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోంది. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. జూరాల, నాగార్జునసాగర్, పాలమూరురంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి వంటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపించారు.

గత కేసీఆర్ ప్రభుత్వం నీటి వాటా విషయంలో.. హైడల్ పవర్ కోసం, రైతులకు సాగునీరు కోసం కృష్ణానదిపై ఆధారపడ్డామని కృష్ణా నదిపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుతో రైతులకు నష్టం జరుగుతుందనే కారణంతోనే గతంలో సుప్రీంకోర్టు దీనిపై స్టే ఇచ్చిందని గుర్తు చేశారు. 2013లో ఎత్తు పెంచాలని ప్రయత్నం



చేసిందని, స్వ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, తెలంగాణకు కృష్ణా జలాల వాటా కేవలం 299 టీఎంసీలు సరిపోతుందని కేసీఆర్ సంతకం చేయడంతో నదీజలాల వాటాలో తెలంగాణకు నష్టం ఏర్పడిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం నీటి వాటా విషయంలో తెలంగాణకు నష్టం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తోందని అందుకే బీఆర్ఎస్ కు ఈ విషయంలో మాట్లాడే నైతిక అర్హత కోల్పోయిందన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు అంశంపై పిటిషన్ సుప్రీంకోర్టులో ఉన్నప్పటికీ, కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. భవిష్యత్తులో డ్యామ్ ఎత్తును పెంచే ప్రయత్నంలో ఇది ఒక ముందస్తు చర్య అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిసారీ ఢిల్లీ వెళ్తుతారని, అదేవిధంగా కర్ణాటకలో ఉన్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే దీనిపై ఆలోచన చేయాలని సూచించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, పాలమూరుకు నీరు ఆగిపోతే ఎందుకు నోరు మూసుకుంటున్నారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యాస కాంట్రాక్టులు, కమీషన్ల పైనే ఉందని కృష్ణా జలాల వాటాను రక్షించడం పై లేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రైతులకు నష్టం కలగకుండా కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు.

# ఐక్యరాజ్యసమితిలో భారత్‌ది కీలక పాత్ర

## యుఎన్ ప్రతినిధి స్టీఫెన్

**మహా:** యూఎన్ భద్రతా మండలిని సంస్కరించేందుకు ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ చాలా మద్దతు ఇస్తున్నారని ఐక్యరాజ్య సమితి ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ అన్నారు. యూఎన్‌లో భారత్ ఒక కీలకమైన స్వరంగా ఉద్భవించిందని అభిప్రాయపడ్డారు. అయితే, యూఎన్ఎస్‌సీలో భారత్‌కు శాశ్వత సభ్యత్వంపై నిర్ణయం సభ్య దేశాలదేనని తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో భారతదేశం పాత్రను, ప్రాతినిధ్యాన్ని పెంచడానికి సంస్థాగత సంస్కరణల అవసరం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ భద్రతా మండలిని 1945లా కాకుండా ప్రస్తుత కాలానికి (2025) అనుగుణంగా సంస్కరించడానికి అపూర్వ మద్దతును ఇస్తున్నారు. యూఎస్ భద్రతా మండలిలో ఏ దేశాలకు అవకాశం కల్పించాలి, శాశ్వత సభ్యత్వ దేశాలుగా ఎవరూ ఉండాలని నిర్ణయించేది సభ్యదేశాలే. భారత్ యూఎన్‌లో కీలక స్వరంగా ఉద్భవించింది. యూఎస్ వ్యవస్థలో చాలా ముఖ్యమైన భాగం. వారు బహుపాక్షికతకు గొప్ప మద్దతుదారులు. ఐరాస చీఫ్‌కు భారత ప్రభుత్వంతో చాలా మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక్కడ మాతో చాలా మంది భారతీయ సహోద్యోగులు పనిచేస్తున్నారు" అని స్టీఫెన్ డుజారిక్ పేర్కొన్నారు.



ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919





# బొత్స వర్సెస్ లోకేశ్

## శాసన మండలిలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం

- విశాఖలో ఉర్సా కంపెనీకి ఎకరా భూమి రూ.1 ఇవ్వడమేంటని బొత్స ప్రశ్న
- నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం అని లోకేశ్ సవాల్

**అమరావతి, మహా:** ఏపీ శాసన మండలిలో మాటల యుద్ధం నడిచింది. మంగళవారం మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణకు.. మంత్రి నారా లోకేష్‌కు మధ్య మాటల మంటలు రేగాయి. విశాఖలో ఉర్సా కంపెనీకి ఎకరా భూమి 1 రూపాయికి ఇవ్వడమేంటని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. దీనికి స్పందించిన మంత్రి లోకేష్.. బొత్స వ్యాఖ్యలను ఖండించారు. ఉర్సా కంపెనీకి ఎకరా రూపాయికి ఇస్తానని తాను ఎక్కడా చెప్పలేదన్నారు మంత్రి లోకేష్. జగన్ చెప్పిన మాటలనే బొత్స సత్యనారాయణ ఇక్కడ చెబుతున్నారని విమర్శించారు. రూపాయికి ఇస్తున్నట్లు తాను చెప్పినట్లు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం అని శాసనమండలి వేదికగా మంత్రి లోకేష్ సవాల్ విసిరారు. టీసీఎస్, కాగ్నిజెంట్ కంపెనీలకు మాత్రమే ఎకరా రూపాయికి భూమిలిచ్చామని మంత్రి వివరించారు. ఉర్సా కంపెనీకి ఎకరా రూపాయికి ఇవ్వలేదని స్పష్టం చేశారు.

**ఇతర పథకాలకు ఫీజు రీయింబర్స్‌మెంటు సొమ్ము..**

ముఖ్యంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటుపై కొన్నాళ్లుగా ప్రశ్నలు సంధిస్తున్న వైసీపీ తాజాగా మండలిని దీనికి వేదిక చేసుకుంది. తొలుత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు అయినా.. లేదని బొత్స వ్యాఖ్యానించారు. ఫీజు రీయింబర్స్‌మెంటు సొమ్ములను కూడా ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్‌తో బొత్స వాగ్వాదానికి దిగారు. బడ్జెట్ లో నిధులు కేటాయించలేదన్న బొత్స వ్యాఖ్యలను పయ్యావుల ఖండించారు.

**బొత్స చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలి..**

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. బొత్స చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలని, లేదా రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎప్పుడు కావాలంటే అప్పుడు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు. ఏ విషయంపైనా చర్చించేందుకు తాము రెడీ అంటూ.. వైసీపీ సభ్యులకు సవాల్ రువ్వారు.

# తెలంగాణ నేలపై అసాధరణ పోరాట జ్వాల సీతక్క



> తెలంగాణ నేలపై వెలిగిన ఒక అసాధారణ పోరాట జ్వాల... ఆమె గుండెలో ఒకే పంతం, ప్రజల సంక్షేమం, గిరిజనుల ఆత్మగౌరవం. తన పోరాటం కేవలం ఓటు కోసం కాదు, సీటు కోసం కాదు. ఇది ఆత్మగౌరవం కోసం, ఈ గిరిజన గడ్డ పౌరుషం కోసం...

> తెలంగాణ రాజకీయాల్లో ఒక నాయకురాలిగా మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రస్థానం ఒక సాధారణమైనది కాదు. ఒక గిరిజన బిడ్డ. ఆమె జీవితం అరణ్యం నుంచి మొదలైంది. ఆమె కళ్ళ ముందు కరువు, పేదరికం, ఆకలి కనిపించా-యి. ఆమె గుండెల్లో ఒకే పంతం, తన జాతి ప్రజలు అభివృద్ధి చెందాలి, ఆకలితో ఏ ఒక్కరూ ఉండకూడదు.

> కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసినప్పుడు, చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు. కానీ సీతక్క మాత్రం తన ప్రజల కోసం బయటికి వచ్చారు. ఆమె ఎంచుకున్న దారి ప్రమాదకరమైనది, నిస్వార్థమైనది. ఆమె ఆటోలో, బైక్‌పై, చివరికి కాలి-నడకన కూడా కొండలు, గుట్టలు దాటి మారుమూల గ్రామాలు, తాండాలకు వెళ్ళారు. లాక్ డౌన్ సమయంలో పనులు కోల్పోయి ఆకలితో ఉన్న పేదల కోసం ఆమె స్వయంగా ని-త్యావసరాలు, ఆహారాన్ని పంపిణీ చేశారు.

తెలంగాణ నేలపై వెలిగిన ఒక అసాధారణ పోరాట జ్వాల... ఆమె గుండెలో ఒకే పంతం, ప్రజల సంక్షేమం, గిరిజనుల ఆత్మగౌరవం. ఆమె ఒక గొప్ప నాయకురాలు. ఆమె కుటుంబం అనుచరులు, తోటి పోరాట యోధులు ఎంత గొప్ప నాయకురాలైతే, అంతే గొప్ప త్యాగాలు చేశారు. ఆమె సంకల్పానికి, ఆమె పట్టుదలకు ఇంతకంటే గొప్ప సాక్ష్యం. ఆమె పేదల గుడిసెల్లో పెరిగారు... ఆమె జీవితం అరణ్యంలో మొదలైంది, తాను అనుభవించిన కష్టం, చూసిన కన్నీరు ఆమెను ఈ మార్గంలో నిలబెట్టాయి. ఆమె అడుగులు ఒక్కటే, కానీ వాటి వెంట ఉన్నవి ఆమె తోబుట్టువుల కలలు, భర్త, సహచరుల త్యాగాలు. వాళ్ళు తమ ప్రాణాలను సమిధలుగా మార్చి వెలిగించిన ఈ దారిలో ఆమె అవిశ్రాంతి ప్రాయాణం చేస్తున్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, చెక్కుచెదరని విశ్వాసంతో, విశ్రాంతి లేకుండా ముందుకు సాగుతున్నారు. తన పోరాటం కేవలం ఓటు కోసం కాదు, సీటు కోసం కాదు. ఇది ఆత్మగౌరవం కోసం, ఈ గిరిజన గడ్డ పౌరుషం కోసం!

ఆమె నోట ఒకే మాట, ఆమె గుండెలో ఒకే పంతం. అది తన జాతి ప్రజలు అభివృద్ధి చెందాలి, మహిళలకు స్వేచ్ఛ ఉండాలి, పేద ప్రజలు ధైర్యంగా బ్రతకాలి. ఈ సంకల్పం కేవలం మాటలకే పరిమితం కాలేదు. జాతి అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఆమె తోబుట్టువులు, సహచరులు ఆశయాలు, పోరాటం, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆమె గిరిజన ప్రజల కోసం, మహిళల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. వారి సంక్షేమం కోసం ఆమె చేస్తున్న కృషి, నిస్వార్థమైన సేవ, రాజకీయాల్లో ఆమె ప్రయాణం, ఆమె పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

తెలంగాణ రాజకీయాల్లో ఒక నాయకురాలిగా మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రస్థానం ఒక సాధారణమైనది కాదు. ఒక గిరిజన బిడ్డ. ఆమె జీవితం అరణ్యం నుంచి మొదలైంది. ఆమె కళ్ళ ముందు కరువు, పేదరికం, ఆకలి కనిపించాయి. ఆమె గుండెల్లో ఒకే పంతం, తన జాతి ప్రజలు అభివృద్ధి చెందాలి, ఆకలితో ఏ ఒక్కరూ ఉండకూడదు. ఈ కల కోసం తన సోదరుడు, భర్తతో కలిసి ఆయుధం పట్టారు. ముఖ్యంగా, తన తోబుట్టువులు, భర్తతో సహా అనేకమంది సహచరులు పేదల సంక్షేమం, గిరిజనుల హక్కుల కోసం పోరాటంలో తమ ప్రాణాలను కోల్పోయారు. ఆ పోరాటం తర్వాత రాజకీయాల్లోకి వచ్చినా, ఆమె ఆశయం మాత్రం మారలేదు. ఆ బాధను దిగమింగుకుని, ఆమె అదే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయడం అసాధారణమైన విషయం. ఆమె జీవితం, ఆమె కుటుంబ సభ్యుల త్యాగాలు, ప్రజల అభివృద్ధి పట్ల ఆమెకున్న నిబద్ధత అందరికీ స్ఫూర్తినిస్తాయి.

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసినప్పుడు, చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు. కానీ సీతక్క మాత్రం తన ప్రజల కోసం బయటికి వచ్చారు. ఆమె ఎంచుకున్న దారి ప్రమాదకరమైనది, నిస్వార్థమైనది. ఆమె ఆటోలో, బైక్‌పై, చివరికి కాలినడకన కూడా కొండలు, గుట్టలు దాటి మారుమూల గ్రామాలు, తాండాలకు వెళ్ళారు. లాక్ డౌన్ సమయంలో పనులు కోల్పోయి ఆకలితో ఉన్న పేదల కోసం ఆమె స్వయంగా నిత్యావసరాలు, ఆహారాన్ని పంపిణీ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఆసుపత్రులు, వైద్య సదుపాయాలు సరిగా లేనందున, ఆమె ప్రజలకు మందులు, మాస్కులు, శానిటైజర్లు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని స్వయంగా వాహనాల్లో ఆసుపత్రులకు తరలించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతి ఇంటినీ పలకరించి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమె కేవలం ఒక నాయకురాలిగా కాకుండా, ఒక సోదరిగా, తల్లిగా ప్రజల మనస్సు గెలుచుకున్నారు.

ఆమె పాదాలు ఎండైనా, వానైనా, కొండలైనా, రాళ్ళైనా ఎక్కడా ఆగలేదు. వెనక్కి తగ్గలేదు. ఆమె పట్టుదలను చూసి ప్రజలు గర్వపడ్డారు, అదే సమయంలో ఆమె పడుతున్న శారీరక శ్రమను చూసి తల్లడిల్లిపోయారు. ఒక నాయకురాలు ప్రజల కోసం ఎంత గొప్ప త్యాగం చేస్తుందో ఆమె నిరూపించారు. జాతి అభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం ఆమె కుటుంబం 'రక్త తిలకం' అయ్యారు. ప్రజలు ఆమెపై పెట్టుకున్న నమ్మకానికి, ఆమె పట్టుదలకు ఇది ఒక గొప్ప సాక్ష్యం. మంత్రి సీతక్క త్యాగనిరతి తెలంగాణ రాజకీయాల్లో ఒక చెరగని ముద్ర వేసింది. ఆమె నిస్వార్థ సేవ, ప్రజల పట్ల ఉన్న ప్రేమ తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

సాధారణంగా, ఒక నాయకుడి పోరాటం వ్యక్తిగతమైందిగా భావిస్తారు. కానీ ఇక్కడ ఆమె కుటుంబమే ఒక పోరాట గెరిల్లాగా మారింది. తన జాతి ప్రజల అభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం నమ్మిన మార్గంలో సోదరులు, జీవిత భాగస్వామితో కలిసి నడిచారు. వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆశయానికి అంకితమయ్యారు. వారి త్యాగాలు కేవలం అమరత్వం కోసం కాదు, భవిష్యత్తు తరాలకు స్వేచ్ఛ, గౌరవం అందించడం కోసం. ఒక నాయకురాలి నాయకత్వ పటిమకు, ఆమె సంకల్పానికి, ఆమె ప్రజల పట్ల ఉన్న ప్రేమకు, తన తోబుట్టువులు, భర్త ఆశయాలను నేరవేర్చాలనే సంకల్పం.



**- పాతులోతు పాండు నాయక్**
**9885333196**

త్యాగాల మార్గంలో ఒంటరిగా నడుస్తున్నా, ఆమె వెనుతిరిగి చూడలేదు. కుటుంబం కోల్పోయిన బాధను గుండెలో దాచుకుని, అదే ఆశయాన్ని ఆయుధంగా మలచుకున్నారు. ఆమె ప్రజలు ఆమెపై పెట్టుకున్న విశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచారు. పాలకురాలుగా మారినా, ప్రజల మధ్యే జీవిస్తున్నారు. వారి కష్టాలు, కన్నీళ్లు ఆమెను నిరంతరం ముందుకు నడిపిస్తున్నాయి. అందుకే ఆమె నాయకత్వం కేవలం పదవికి పరిమితం కాలేదు. అది ప్రజల గుండెల్లో బలంగా నాటుకుపోయింది. ఆమె పట్టుదల, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత, అంకితభావం ఈ త్యాగాల గాథకు నిలువుటద్దం. ఆమె జీవితం, పోరాటం, ఆమె కుటుంబం చేసిన త్యాగాలు... ఇవన్నీ ఈ తరానికి, భావి తరాలకు నిరంతర స్ఫూర్తిని అందిస్తాయి.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# బతుకమ్మ పాటలతో మార్మోగుతున్న తెలంగాణ

తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పండుగలలో అతి ముఖ్యమైన పండుగ బతుకమ్మ. మూడు రోజులుగా తెలంగాణ ప్రాంతమంతా బతుకమ్మ ఆట, పాటలతో మార్మోగుతున్నది. ప్రజలు జరుపుకునే పండుగలలో ఈ పండుగ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. ప్రకృతిని ఆరాధించి, పూజించే సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన పండుగ ఇది. ప్రకృతి ప్రసాదించిన పువ్వులతో దేవతలను పూజించడం ఒక ఆనవాయితీ అయితే ఆ పూజించే పువ్వులనే దేవతగా భావించి కొలిచే విశేషమైన పువ్వుల పండుగ "బతుకమ్మ పండుగ". ఇది ఒక్కరోజు పండుగ కాదు. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా ఆడపడుచులు అత్యంత వైభవోపేతంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఘనమైన పండుగ. తరతమబేధాలులేక తెలంగాణా ప్రజలంతా ఒక్కటై జరిపే ఆధ్యాత్మిక వేడుక ఈ బతుకమ్మ.

ఒక పళ్ళెంలో గుమ్మడి ఆకులు వేసి, ఈ కాలంలో విరివిగా పూసే గునుగు, తంగేడు, బంతి చామంతి, ఎర్ర గన్నేరు, పచ్చ గన్నేరు, ముద్దబంతి, మందార, రుద్రాక్ష, కట్ల, బీరతోపాటు అందుబాటులోగల అనేక రకాల పూలతో ఒక క్రమ పద్ధతిలో గుండ్రంగా ప్రారంభించి శంఖు ఆకారంలో బతుకమ్మను పేర్చి తీర్చిదిద్దుతారు. పసుపుతో గౌరీ ప్రతిమను చేసి బతుకమ్మపై ఉంచి, గౌరీదేవికి ప్రతిరూపంగా భావించి పసుపు, కుంకుమ, పూలను సమర్పించి, భక్తి శ్రద్ధలతో పూజించి ప్రతిరోజుకొక తీరు ప్రసాదాలు, ఫలహారాలు నైవేద్యం పెట్టి, సాయంత్రం ఇంట్లో కొంత సేపు బతుకమ్మను పూజించి పాటలు పాడుతూ ఆడిన తదుపరి ఆ ప్రాంతానికి చెందిన మహిళలంతా కలిసి తమ పరిసరాల్లోని అనుకూలమైన చోట అలికి, ముగ్గేసి బతుకమ్మలను నిలుపుతారు. ఆడపడుచులంతా లయాత్మకంగా పాటలు పాడుతూ, ఒక ప్రత్యేక పద్ధతిలో చప్పట్లు కొడుతూ ఆనందోత్సాహాల మధ్య ఆ బతుకమ్మలు ఆడుతూ తమ భక్తిని చాటుతుంటారు.

ఈ సంవత్సరం భాద్రపద అమావాస్య సెప్టెంబర్ 21వ తేదీ ఆదివారం నుండి ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు తొమ్మిది రోజుల పాటూ వైభవంగా కొనసాగి 30వ తేదీ దుర్గాష్టమితో ముగుస్తాయి. భాద్రపద అమావాస్య నుండి దుర్గాష్టమి వరకూ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. బతుకమ్మ పండుగకు నెల రోజుల ముందే గ్రామాలలో పండుగ సందడి ప్రారంభమౌతుంది. ప్రతి ఇంటి ఆడపడుచులను ఈ పండుగకు పుట్టింటి వారు ఎంతో ప్రేమతో ఆహ్వానిస్తారు. బిడ్డలు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు అందరికీ కొత్త బట్టలు కానుకలుగా ఇస్తారు. ఏ పండుగకూ లేని విధంగా ఈ పండుగకు ప్రతి కుటుంబం తమ తమ స్థాయికి తగినట్టుగా కొత్త బట్టలు కొనడం, కుట్టించుకోవడం ధరించడం తెలంగాణ ప్రాంతలో ఒక ఆనవాయితీగా కొనసాగుతున్నది.



### ఇదీ పండుగ

మొదటి రోజైన "ఎంగిలి పూల బతుకమ్మ"తో బతుకమ్మ పండుగ ప్రారంభమౌతుంది. ఈరోజు నువ్వులు, చక్కెర, బెల్లం నైవేద్యంగా పెడతారు. రెండో రోజు ఆశ్వయుజ శుక్ల పాడ్యమి "అటుకుల బతుకమ్మ" జరుపుకుని, అటుకులు,బెల్లం, పప్పును నివేదిస్తారు. మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ అంటారు. ఈరోజు ముద్దపప్పు, బెల్లం ప్రసాదం సమర్పిస్తారు. నాలుగవ రోజు నానె బియ్యం బతుకమ్మ ఈరోజు నానబెట్టిన బియ్యం పాలు బెల్లంతో పరమాన్నం వండి నైవేద్యం పెడతారు. ఐదవ రోజు అట్ల బతుకమ్మ రోజు అట్లు చేసి నివేదిస్తారు. ఆరవ రోజు అలిగిన బతుకమ్మ ఆ రోజు బతుకమ్మకు, గౌరమ్మకు ప్రత్యేకమైన నైవేద్యం సమర్పించరు. ఇంట్లోనే బతుకమ్మలు ఆడుతారు. ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ ఈరోజు వేప కాయలను పోలిన విధంగా బియ్యం పిండితో గుండ్రగా తయారుచేసి వేయించిన పదార్థాన్ని నైవేద్యం పెడతారు. ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ ఈ రోజు బియ్యం పిండి వెన్న బెల్లంతో ప్రసాదం చేసి పెడతారు. ఇక తొమ్మిదో రోజు దుర్గాష్టమి నాడు జరిగే "సద్దుల బతుకమ్మ" ను అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ఈ రోజు బతుకమ్మలను గడిచిన ఎనిమిది రోజులకు భిన్నంగా ఆడ, మగ, పిల్లలు, వృద్ధులనే తేడాలేకుండా కలిసిమెలిసి, ఒకరిని మించి ఒకరు పోటీ పడి పెద్ద ఎత్తున పూలను సేకరించి గునుగు పూలను రకరకాల రంగులలో అద్ది, వివిధ రకాల పూలతో రంగుల రంగుల కాగితపు పూలతో అలంకరించి, ఎవరికి వీలైనంత ఎత్తులో వారు బతుకమ్మలను పేర్చుతారు. ఆపై బతుకమ్మలను భక్తి శ్రద్ధలతో పూజించి చింతపండు, నిమ్మరసం, పెరుగు, కొబ్బరి, నువ్వులు/ పుట్నాల పొడులు తదితర పదార్థాలతో చేసిన కనీసం ఐదు రకాల సద్దులను, పాయసం, మక్క గారెలను నైవేద్యంగా పెడతారు. ఆరోజు సాయంత్రం ప్రతి రోజుకన్నా కొంచెం ముందుగానే బతుకమ్మలను గ్రామాలు, పట్టణాలలోని ముఖ్యమైన ప్రాంతాలలో నిలిపి అమితమైన భక్తి ప్రపత్తులతో ఆడపడుచులందరూ కలిసి అత్యంత ఆనందోత్సాహాలతో "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు గౌరమ్మ ఉయ్యాలో" అని పాటలు పాడుతూ లయాత్మకంగా చప్పట్లుకొడుతూ బతుకమ్మలను ఆడిన తదుపరి ఉత్సాహంగా చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. అనంతరం నైవేద్యం పెట్టిన సద్దులు, ప్రసాదాలను కుటుంబ సమేతంగా చెరువుగట్టున కూర్చుని తిని చెరువులో నిమజ్జనం చేసిన బతుకమ్మలను ఒకసారి తనివితీరా చూసి ఇంటికి బయలుదేరుతారు. ఈ పండుగ రోజు ఆడపడుచులతోపాటు కుటుంబ సభ్యులంతా పండుగ ఏర్పాట్లలో భాగస్వాములై చొరవతో పాల్గొనడం విశేషం.

బతుకమ్మ పండగ తెలంగాణలో ఎప్పుడు ప్రారంభమైందో చెప్పేందుకు సరైన చారిత్రకమైన ఆధారాలు లేనప్పటికీ, గత అనేక ఏళ్లుగా ఈ పండుగ కొనసాగుతోందని చెప్పేందుకు అనేక కథలున్నట్లు పెద్దలు చెప్పుకుంటారు. జగదీశ్వరి దుర్గాదేవి మహిషాసురుడిని చంపిన తర్వాత అలసిపోయి కొన్నిరోజులు మూర్చపోయిందని, ఆమెను మూర్చ నుండి మేల్కొలిపేందుకు స్త్రీలంతా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారని, "బతుకమ్మ తల్లీ... బతుకమ్మ తల్లీ" అంటూ పాటలు పాడడంతో సరిగ్గా పది రోజుల తదుపరి ఆ దుర్గాదేవి మేల్కొని నిద్ర లేచిందని, ఆ సందర్భాన్ననుసరించి అప్పటి నుండి ప్రజలంతా సంతోషంతో "బతుకమ్మ" పండుగ వేడుక జరుపుకుంటున్నారని ఒక కథనం చాలా సంవత్సరాలుగా ప్రచారంలో ఉన్నది. చోళరాజు ధర్మాంగదునికి వంద మంది కుమారులు పుడతారు, వారందరూ ఒక యుద్ధంలో మరణిస్తారు. చాలా కాలం తర్వాత లక్ష్మీదేవి అనుగ్రహంతో వారికి ఆడ పిల్ల పుడుతుంది. ఎదురు చూడగా పుట్టక, పుట్టక చాలా రోజులకు పుట్టిన పిల్లకు బతుకమ్మ అని పేరు పెట్టి, నిండు నూరేళ్లు బతకాలని ఆ పిల్లను అందరూ ఆశీర్వదిస్తారు. ఆ అమ్మాయే "బతుకమ్మ"గా పూజలందుకుంటున్నట్లుగా మరొక కథనం కూడా ఉన్నది. ఈ వేడుకలో అలిగిన బతుకమ్మ రోజు మినహా మిగిలిన రోజుల్లో అమ్మవారికి రోజుకో రకమైన నైవేద్యం సమర్పిస్తుండటం ఆనవాయితీ. అమావాస్య నుండి తొమ్మిది రోజులపాటు నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా ఘనంగా జరిగే బతుకమ్మ పండుగ తొమ్మిదవ రోజైన దుర్గాష్టమి రోజున "సద్దుల బతుకమ్మ" సంబరాలతో ముగుస్తుంది.

**- నాగరాజు కామర్సు**
**92480 93580**

# సింగరేణిలో సంవత్సరానికి 5 గనులు ప్రారంభించాలి

- పెద్దపల్లి నుండి మంచిర్యాల వరకు కాంగ్రెస్ గుండాయిజం ఎక్కువైంది
- స్వరాష్ట్రంలో సింగరేణి ఉద్యోగాలు సాధించుకున్నాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఘాటు వాక్యాలు



**మంచిర్యాల, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీలో సంవత్సరానికి 5 కొత్త గనులు ప్రారంభించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాక్యానించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా ఆర్కే 5 కాలనీలో సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి నివాసంలో బతుకమ్మ పేర్చే కార్యక్రమానికి ఆమెతో పాటు ఆ యూనియన్ జేబీసీసీఐ కమిటీ సభ్యులు రియాజ్ అహ్మద్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ వ్యయంలో సింగరేణి కంపెనీకి వచ్చిన వార్షిక లాభాల నుండి ప్రతి సంవత్సరం ఐదు కొత్త గనులను ప్రారంభించాలని ప్రతిపాదనలు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఆ ప్రతిపాదలను కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇక్కడ బొగ్గు గనులు ప్రారంభమైతే నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని స్పష్టం చేశారు. ఆనాడు ఆంధ్ర వలస పాలనలో ఉద్యోగాలు ఎక్కడ దొరికేటివి కావని అన్నారు. కేవలం సింగరేణి కంపెనీలో మాత్రమే ఉద్యోగ అవకాశాలు ఉండేటివని చెప్పారు. తప్పనిసరి పరిస్థితులలో తెలంగాణ ప్రాంత బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడాలని తెలంగాణ స్వరాష్ట్రాన్ని కొట్లాడి సాధించుకున్నామని గత తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని గుర్తుకు తెచ్చారు. సింగరేణికి వచ్చిన లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికి చెప్పకుండా అభివృద్ధి పేరిట వందల కోట్లా రూపాయలు తీసుకుంటుందని ఆరోపించారు. ఇవే కాకుండా సింగరేణికి రావలసిన విద్యుత్ బకాయిలు 42 వేల కోట్ల రూపాయలు ఇవ్వకుండా నాన్సుడు ధోరణి అవలంబిస్తుందని వివరించారు. ఈ డబ్బులే చాలదన్నట్లు ఎల్ఐసి సంస్థ దగ్గర అప్పులు తీసుకొని కర్ణాటక ఇతర రాష్ట్రాలలో సింగరేణి సంస్థ విస్తరణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉవ్విల్లు ఊగుతుందని పేర్కొన్నారు.

**పెద్దపల్లి నుండి మంచిర్యాల వరకు కాంగ్రెస్ గుండాయిజం ఎక్కువైంది**

పెద్దపల్లి నుండి మంచిర్యాల వరకు కాంగ్రెస్ నాయకులే గెలిచారన్నారు. ఇక్కడ గెలిచిన నాయకులు, వారి అనుచరుల గుండాయిజం, రౌడీ యిజాలు ఎక్కువయ్యాయని అన్నారు. ఇవి కొద్ది రోజులు మాత్రమే నడుస్తాయని అన్నారు. ఈ చర్యలను మార్చుకోకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయం అయిందని ఘాటుగా ఆరోపించారు. అవినీతికి స్వస్తి పలికితే కొత్త గనులతో పాటు వేల కొరది ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. సింగరేణి గని కార్మికులను కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి మహిళా నాయకురాళ్ళు, హెచ్ఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్**




**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిపరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న అన్ని గదులను పరిశీలించారు. ఏ గదిలో ఏ విభాగం కొరకు వినియోగిస్తున్నారని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ లో ఎలాంటి పరీక్షలు చేస్తున్నారు. రోజుకు ఎంతమందికి రక్త పరీక్షలు చేస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసి కి సంబంధించిన ఎన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రోగులకు అన్ని రకాల మందులు సరిపోతున్నాయా లేదా ఇంకేం మందులు ఇస్తున్నారని ఫార్మసిస్టుని అడిగి తెలుసుకున్నారు...స్టాఫ్ నర్స్, హెల్త్ సూపర్వైజర్ల వైద్య సేవలపై ఆరా తీసారు.అనంతరం జిల్లా కేంద్రంలోని వైద్యాధికారి కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలులో ఉన్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించి, కాలానుగుణ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు.. స్వస్థ నారి స్వసక్త పరివార అభియాన్, ఇతర ఆరోగ్య కార్యక్రమాల సక్రమ అమలుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని తెలిపారు. క్యాంప్‌కు హాజరైన అభివృద్ధి లో ఉన్న బాలికలు రోగులకు రోగులకు ఉన్న అనారోగ్య సమస్యలను చెప్పే సమయంలో పూర్తిస్థాయిలో వైద్యులు విన్న తర్వాత వారికి ఎలాంటి జబ్బు ఉందో నిర్ధారించి వైద్య పరీక్షలు చేయాలన్నారు. వారు చెప్పిన లక్షణాలను మనం చిరునవ్వుతో వింటే రోగికి 50% వరకు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. వారు చెప్పిన లక్షణాలను బట్టి మన వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో ప్రసూతి వైద్య సేవలు గురించి ఆరా తీశారు .ఎంతమంది అడ్మిట్ ఉంటున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో మెడికల్ పారామెడికల్ సిబ్బంది వైద్యులు ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సాధన, జిల్లా మలేరియా నివారణ అధికారి ఎన్సిడి అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్టపల్లి వార్, అంకోలి ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి సర్ఫరాజ్ ఖాన్ , పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి చేయూత

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల శాంతిఖని కి చెందిన ఆటో డ్రైవర్ కోయల రమేష్ ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యలను పరామర్శించి బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.5000 అందజేశార ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షులు కట్ట రామ్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ పాడెపు మల్లికార్జున్ లు మాట్లాడుతూ అనారోగ్యానికి గురై మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షేక్ సర్దార్ ఆలీ, శాంతి గాని ఆటో డ్రైవర్స్ రాజ మొగిలి, పొన్నాల శ్రీనివాస్, కుక్కమూడి శ్రీనివాస్, జహీర్ఖాన్, మహమ్మద్ ఖాన్, లు పాల్గొన్నారు.



# కాలనీ వాసుల శ్రమదానం

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు శ్రమదానం చేసారు. వర్షాకాలం కావడంతో కాలనీలోని ఖాళీ ప్రదేశాలలో పెరిగిన పిచ్చిమొక్కలతో పాటు ప్రభుత్వ స్థలంలోని మున్సిపల్ పార్క్ లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే కాలనీలోని దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతంలో కూడా పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపరిచారు. కాలనీ వాసులను పలువురు అభినందించారు.

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**



**ఆమనగల్లు, మహా:** రాష్ట్ర ప్రజల సంక్షేమం, తండాల, గ్రామాల,రాష్ట్ర అభివృద్ధి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మైసిగండి లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారం తో 5 లక్షల నిధులతో డ్రైనేజ్ పనులను స్థానిక నాయకుల తో కలిసి శ్రీనివాస్ గౌడ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం తో ఎంపీ మల్లు రవి గారితో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నియోజకవర్గానికి అత్యధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారని గతంలో లేని విధంగా 20 నెలల్లో వందల కోట్ల నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గం లా తీర్చి దిద్దడానికే ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని రెండవ దాఫా లో రాని వారికీ ఇండ్లు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ లాల్ నాయక్, హీరాసింగ్ నాయక్, రవి నాయక్, గ్రామ కార్యదర్శి జంగయ్య గౌడ్, హర్యానాయక్, స్టాలిన్ కిషన్ నాయక్,యాదగిరి నాయక్, తులసి రాం నాయక్, నరేష్ నాయక్, గోపాల్ నాయక్,, సుబ్బా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా భవనాన్ని ప్రారంభించిన మంత్రి



**మందమర్రి, మహా :** మందమర్రి మండలం రామకృష్ణాపూర్ మునిసిపాలిటీలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మెప్మా భవనాన్ని రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేకానంద, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళ శక్తి సంఘాలకు 21వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందజేసినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని వెల్లడించారు. మొదటగా రాష్ట్రంలో 2004 సంవత్సరంలో మహిళల సంఘాలకు పావల వడ్డీ రుణాలను దివంగత నేత వైఎస్. రాజ శేఖర్ రెడ్డి అందించారని స్పష్టం చేశారు. ఇప్పటివరకు మహిళల ఫ్రీ బస్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. గడిచిన 10 సంవత్సరాలలో భారత రాష్ట్ర సమితి కేసీఆర్ ప్రభుత్వం పేదలకు రెండు పడకల గృహాలను మంజూరు చేస్తామని మోసం చేసిందని ఆరోపించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదలకు భరోసా ప్రభుత్వం అని ప్రజలు కొనియాడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి తాసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం కల పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.




అర్బన్ ప్రైమరీ ఆరోగ్యకేంద్రంలో క్షయ రోగులకు

# న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణ అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లో క్షయ వ్యాధి రోగులకు న్యూట్రిషన్ కిట్లను క్షయ వ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్ తోపాటు మెడికల్ ఆఫీసర్ సుచరిత మంగళవా రం నాడు అందజేశారు.శంషీనగర్ బస్తీలోని హెల్త్ కేర్ సెంటర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో క్షయవ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ డా. సుధాకర్ నాయక్ టిబి ముక్త్ భారత్ నిక్షయ్ మిత్ర తరుపున తెలంగాణ ప్రభుత్వం క్షయ నివారణ సోసైటి ఆధ్వర్యంలో మహిళా టిబి పేషెంట్ లకు ఒక్కొక్కరికి రూ.1000 నగదు విలువైన ప్రోటీన్ ఆహార కిట్ లను అందించారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సుచరిత మాట్లాడుతూ " టిబి పేషెంట్ లకు మందులతో పాటు బలమైన పోషకాహారం చాలా తొందరగా కోలుకోవచ్చు అని,ఎన్టీఈపి స్ఫూర్తితో జిల్లాలోమరింత మంది నిక్షయ్ మిత్రలుగా నమోదు చేసుకొని టీబీ రహిత సమాజం కొరకు టిబి న్యూట్రిషన్ కిట్'లను అందించాలని పిలుపునిచ్చారు. దీనితో పాటు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ లో భాగంగా ప్రతి మహిళ అన్ని రక్తపరీక్షల తోపాటు టిబి నిర్ధారణ పరీక్షలు కూడా చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డా. సుధాకర్ నాయక్,వైద్యాధికారి సూచరీత, సిహెచ్ఓ సత్తయ్య, టిబి సూపర్వైజర్ శశికాంత్, హెల్త్ విజిటర్ వెంకటేశం, ల్యాబ్ టెక్నీషియన్ చెన్న కేశవులు, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహెందర్, ఏఎన్ఎమ్ లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# నల్లబెల్లం పట్టివేత

**కేసు నమోదు**

**ఆమనగల్లు, మహా:** దసరా పండుగ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నల్ల బెల్లం అక్రమ రవాణా,విక్రయం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు.మంగళవారం ఆమనగల్లు పట్టణకేంద్రంలో హైదరాబద్ నుంచి ఇతర ప్రాంతాలకు సారా తయారీ కోసం వాడే ముడి పదార్థాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనంలో 65 బ్యాగులలో సుమారు 1950 కిలోల నల్లబెల్లం, 40 కిలోల ఆలం దొరికినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా మరొక వాహనాన్ని సోదా చేయగా సుమారు 300 కేజీల నల్ల బెల్లం పొదరు, 10కిలోల పట్టిక లభించినట్లు సీఐతెలిపారు. ఈ సందర్భంగా అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న మహర్షి, కాశిం, ఎల్ల స్వామి లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 2250 కిలోల సారాముడి పదార్థాలతో పాటు రెండు వాహనాలను, 60 కిలోల ఆలం, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు అరుణ్ కుమార్, సిబ్బంది శంకర్, లోక్య, బాబు, ఉపేందర్ ఆమని తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్త అరెస్టుపై నిరసన



**ఆమనగల్లు, మహా:** సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు పెట్టాడని బీఆర్ఎస్ కార్యకర్తను అరెస్టు చేశారని,ఈ చర్యను నిరసిస్తూ ఆమనగల్లులో నిరసన తెలిపారు.బిఆర్ఎస్ నేతల అరెస్టును ఖండిస్తూ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అరెస్టు అన్యాయమని, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షులు పత్యా నాయక్, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్,మాజీ ఎంపీటీసీ కుమార్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్, వెంకటేష్,వరకుప్పల గణేష్, శంకర్,విక్రమ్, కిషోర్, నాగిళ్ల జగన్,జ్యోతయ్య, సొమ్లు, కటికల శేఖర్,దారమోని గణేష్,రమేష్ గౌడ్,శేఖర్,సతీష్,మహేష్ నేత,విమల, లలిత తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలి

**సిపిఐ నాయకులు నరసింహారెడ్డి**



**రాజేంద్రనగర్ మహా ;** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్వో బొమ్మ రాములుని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డబల్ బెడ్ రూమ్ ఇల్లులు కట్టిస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు కాలయాపన చేస్తూ పేద ప్రజలకు డబల్ బెడ్ రూమ్లు అందించడంలో విఫలమయ్యింది. లక్ష బెడ్రూంలో పంచుతామన్న సర్కారు పేద ప్రజల ఆగ్రహానికి గురైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు చేసుకునేందుకు మరొకసారి గడువు ఇచ్చినట్లయితే బాగుంటుందన్నారు. అర్హులైన రాష్ట్ర ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాజేంద్రనగర్ మండల ప్రజల తరపున పోరాటాలు నిర్వహిస్తుందన్నారు పేద ప్రజల పక్షాన నిలబడుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ విషయంపై తక్షణమే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు పింఛన్లు తెల్ల రేషన్ కార్డులు వికలాంగుల పింఛన్లు వింతంతు పింఛన్లు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల రాజేంద్రనగర్ మండల సమితి ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ గౌడ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, కన్యగారి లక్ష్మి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, విజయ ఆనంద్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, సత్యం, సిపిఐ నాయకులు పాండు,సయ్యద్ ఖాజా, బండారి శాంతమ్మ, మధురి కృష్ణ, సదానంద గౌడ్, మునేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక దృష్టి సారించారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల విద్యాధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లతో ప్రధానమంత్రి పోషణ్ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నిత్యం పౌష్టికాహారం అందజేసి, వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో 747 పాఠశాలలో 34 వేల 818 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం క్రింద మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతో పాటు రోజు విడిచి రోజు కోడిగుడ్డు అందించడం జరుగుతుందని వివరించారు. 1 వ తరగతి నుండి 8 వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం చెల్లింపులు జూలై 2025 వరకు జరిగాయని అన్నారు. మిగతా బిల్లులు త్వరలోనే చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించిన బిల్లులు నిర్ణీత గడువులో ఇవ్వాలని సూచించారు. జిల్లాలో దాదాపు 78 శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం కింద లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఈ పథకం 100 శాతం విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 11 శాతం పాఠశాలలలో మాత్రమే కిచెన్ గార్డెన్స్ అందుబాటులో ఉన్నాయని, పాఠశాలలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కిచెన్ గార్డెన్స్ (స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్) ఏర్పాటు చేసేలా కృషి చేయాలని తెలిపారు. జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తమ పరిధిలోని పాఠశాలను సందర్శిస్తూ మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణపై పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా బతుకమ్మ సంబరాలు


**ఆదిలాబాద్ మహా :** బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి అన్నారు. మంగళవారం జిల్లా ఎస్టీ ఎస్సీ, బీసీ, మైనారిటీ శాఖల ఆధ్వర్యంలో స్థానిక సంక్షేమ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేడుకలుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ తొమ్మిది రోజులు జిల్లా మండలాలలో అన్ని శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. తక్కువ సమయంలో ఎంతో గొప్పగా తొలిరోజు వేడుకలను నిర్వహించిన అధికారులు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్స్ శ్యామలాదేవి , రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పట్టణానికి చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి ఆశీర్వచనాలు అందరికీ ఉండాలి

**రాజేంద్రనగర్ మహా :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి హైదర్ గూడ లోనీ శ్రీ పోచమ్మ దేవాలయంలో దేవీ నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సందర్భంగా రెండవ రోజు మంగళవారంఅమ్మ వారి పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో హోమంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఘనంగా దేవీ నవరాత్రులు నిర్వహిస్తారు. హైదర్గూడా పరిధిలో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం దంపతులు, శ్రీకాంత్ దంపతులు, నరేందర్ ఆలయ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి రద్దు చేశారు



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణానికి చెందిన పులికంటి మైసయ్యకుమంజూరైన ఇందిరమ్మ ఇంటిని రద్దు చేశారని మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ వెంకటేశ్ అన్నారు. మంజూరు చేసి, రూ. లక్ష మొదటి విడత బిల్లు ఇచ్చిన తర్వాత ఇల్లు రద్దు చేశారని తెలిపారు. మంగళవారంస్థానిక నాయకులతో కలిసి బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎలక్షన్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మరో కొత్త నాటకం తెరపైకి తెచ్చి స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రకటనతో రాష్ట్ర ప్రభుత్వం చాలా మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లు ఇచ్చి రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వనికి ,స్థానిక ఎమ్మెల్యేకి చిత్త శుద్ధి ఉంటే కల్వకుర్తి నియోజకవర్గం లో అనుమతులు ఇచ్చి రద్దు చేసిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఉప్పల వెంకటేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షులు పత్యా నాయక్, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ కుమార్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్, వెంకటేష్,వరకుప్పల గణేష్, శంకర్,విక్రమ్, కిషోర్, నాగిళ్ల జగన్,జ్యోతయ్య, సొమ్లు, కటికల శేఖర్,దారమోని గణేష్,రమేష్ గౌడ్,శేఖర్,సతీష్,మహేష్ నేత, విమల, లలిత తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఉపాధ్యాయులను వేధిస్తున్నారు

**విద్యాశాఖ అధికారులు సంబంధిత విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయువి) డిమాండ్**



**మంచిర్యాల, మహా :** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు కళాశాలలకు విద్యాశాఖ ఈనెల 21 నుండి దసరా సెలవులు ప్రకటించినప్పటికీ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం ఉపాధ్యాయులను బెదిరిస్తూ యధావిధిగా పనులు బోధన చేపించుకుంటున్నారని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయువి) రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం మంచిర్యాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శ్రమదోపిడికి గురి చేస్తున్నారని అన్నారు. ఒకవైపు దసరా సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు ఈనెల 21 నుండి రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సెలవులు ప్రకటించిన విషయం విధితమే. ఇక్కడి కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు ఉపాధ్యాయులతో యధావిధిగా విధులకు హాజరుకావాలని హుకుం జారీ చేస్తున్నారని అన్నారు. విధులకు హాజరు కానిపక్షంలో నెలవారి జీతభత్యాలు ఇవ్వబోమని ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తూ పనులు బలవంతంగా చేపించుకుంటున్నారని ఆయన ఆవేద వ్యక్తం చేశారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకొని ఆయా విద్యా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు ఇప్పించేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలాజీ, విష్ణు, రమేష్, సాయి చరణ్ లో పాల్గొన్నారు.

# శాస్త్రీయంగా ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంటు ఉండాలి

## భూ నిర్వాసితులకు అండగా సీపీఐ(ఎం).. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**రంగారెడ్డి జిల్లా మహా:** రాష్ట్రంలో ఆయా ప్రాజెక్టుల మూలంగా భూమిని నష్టపోయే నిర్వాసితులకు సీపీఐ (ఎం) అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. రాష్ట్ర, జాతీయ రోడ్డు ప్రాజెక్టులతో పాటు ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణం సందర్భంగా భూములను కోల్పోయే బాధితులను ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని ప్రకటించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్లో ఆర్ఆర్ఆర్ ప్రభావిత జిల్లాలు, మండలాల సీపీఐ(ఎం) నాయకులతో సమావేశం నిర్వహించారు. దీనికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, తెలంగాణ రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్ అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ... ప్రభుత్వాలు ఆయా ప్రాజెక్టులు, పథకాలను అమలుచేస్తున్న సందర్భంగా అత్యధికంగా భూసేకరణ చేస్తున్నాయన్నారు. దీనిమూలంగా పేద ప్రజలు, రైతులు తమకున్న కొద్దిపాటి భూములను కోల్పోవాల్సి వస్తున్నదని చెప్పారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటే సహించబోమన్నారు. ఆర్ఆర్ఆర్ ఆలైన్మెంటు శాస్త్రీయంగా జరగాలని చెప్పారు. నిర్వాసితులు సమస్యలు తెలుసుకుని ఉద్యమించనున్నట్టు తెలిపారు. రైతులు, స్థానిక పేదలకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తామని అన్నారు.

**భూనిర్వాసితుల కోసం పోరాటం...**

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ... ఆర్ఆర్ఆర్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనం కోసం చూస్తున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలి. భూసేకరణ సందర్భంగా వేలాది ఎకరాలు నష్టపోతున్న రైతులు, పేదల ప్రజల తరపున సీపీఐ(ఎం) పోరాటం చేస్తుంది, ఈ ప్రాజెక్టు కోసం 45 వేల ఎకరాల భూమితోపాటు రూ.22 వేల కోట్లు అవసరవముతాయని అధికారులు చెబుతున్నారు. భారీస్థాయిలో రైతుల భూములను తీసుకోవడం ఎంతమాత్రం సరికాదు. రైతుల ప్రయోజనాల కోసం సీపీఐ(ఎం) పోరాడుతుంది,

**చట్ట ప్రకారమే భూసేకరణ చేయాలి.**

టి సాగర్ మాట్లాడుతూ... ఆర్ఆర్ఆర్తోపాటు ఇతర ప్రాజెక్టుల కోసం చట్ట ప్రకారమే భూసేకరణ చేయాలి. పర్యావరణం గురించి పట్టించుకోవాలి. ప్రభుత్వం కోసం చేస్తే 70 శాతం రైతులు, ప్రజలు ఒప్పుకోవాలి. ప్రయివేటు కోసం చేస్తే 80 శాతం అంగీకరించాలి. ప్రభుత్వ భూమిని అయినా పట్టా భూమితో సమానంగా ఖాస్తులో ఉండే రైతులకు పరిహారమివ్వాలి. భూసేకరణను అడ్డుకుంటే కేసులు పెట్టడం ఎంతమాత్రం సరికాదు.

**ప్రభుత్వ భూములే తీసుకోవాలి.**

సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వ భూములే తీసుకోవాలి. రైతులు, పేదలని ముట్టుకోవద్దు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలుచేయాలి. పరిహారం విషయంలో రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమి ఉంది. వాటిని అభివృద్ధి కోసం వాడుకోవాలి. ఈ సమావేశానికి ఆర్ఆర్ఆర్ భూసేకరణ బాధిత ఎనిమిది జిల్లాల నుంచి సీపీఐ (ఎం) నాయకులు హాజరయ్యారు. యాదాద్రి భువనగిరి, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్నగర్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లోని 22 మండలాల నుంచి నాయకులు సమావేశానికి వచ్చారు. ఈసందర్భంగా స్థానిక భూసేకరణ వ్యవహారంపై చర్చించారు.

# దసరా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మహా:** నియోజకవర్గ ప్రజలందరూ దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్ నాయక్, సీఐ జానకి రామ్ రెడ్డి, ఎస్ఐ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దసరా ఉత్సవాల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. దుర్గ మాతః ఊరేగింపులో రోడ్డు గుంతలు లేకుండా చూడాలని, వెళ్లే మార్గంలో లైట్లను అమర్చాలని ఆయన సూచించారు. అనంతరం శివాలయం కాలనీలోని పురాతన శివాలయంలో దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జమ్మి పూజ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మండల ప్రజలకు దుర్గామాత, దసరా ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మన రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన గొప్ప పండుగ దసర అన్నారు. కుల మతాలకు అతీతంగా అందరూ ఐకమత్యంతో శాంతియుతంగా పండుగ జరుపుకోవాలన్నారు. ఎలాంటి గొడవలకు తావివ్వకుండా మండల ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా నాయకులుకృష్ణ నాయక్, అప్పం శ్రీనివాసులు, శివలింగం, ఖాదర్ ఖాద్రి, అబ్దుల్ అలీమ్, మెకానిక్ బాబా, కండె సాయి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, నాయకులు జలాల్, పర్వతాలు, శ్రీను నాయక్, శేఖర్ గౌడ్, దేవరశెట్టి మహేష్, నాజర్, కుమార్ గౌడ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ స్వాధీనం

**రాజేంద్రనగర్ మహా ;** వివిధ రాష్ట్రాల నుంచి నాన్ పేయిడ్ డ్యూటీ లిక్కర్ అక్రమంగా తరలిస్తుండగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దసరా పండుగ నేపథ్యంలో హర్యానా, గోవా, ఉత్తరప్రదేశ్, లక్నో తదితర రాష్ట్రాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నగరానికి తరలిస్తుండగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 360 బాటిల్స్ లిక్కర్, మొత్తం 280,లీటర్స్ ను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యాహ్నం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఎక్సైజ్ డి.ఎస్.పి జీవన్ కిరణ్ హెచ్చరించారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించండి



## బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయి

**వరంగల్ మహా;** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులు పూర్తయిననేపథ్యంలో వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భం గా కమిషనర్ గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31వ డివిజన్లోని దీన్ దయాల్ కాలనీ, 50వ డివిజన్లోని ఇందిరా కాలనీ, రాంపూర్ జవహర్ కాలనీ గోపాల్పూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి డ్రైన్ లు, రోడ్ల నిర్మిత సంబంధ పనుల ప్రమాణాలను ఎం బి బుక్ ల ప్రామాణికం గా కొలతలు వేయించి ధ్రువీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంపూర్ ప్రాంతంలో బల్దియా ఉద్యానవనాల విభాగం ద్వారా సెంట్రల్ మీడియన్ లో ఏర్పాటు చేస్తున్న మొక్కలను కమిషనర్ పరిశీలించి సమర్ధ నిర్వహణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డీఈ రాగి శ్రీకాంత్, రాజ్ కుమార్, సారంగం, ఏఈ మేనక, హార్టికల్చర్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గిరిజనుల సమగ్ర అభివృద్ధి

## రాష్ట్రంలో 740 కోట్లతో గిరిజన ఆవాసాలలో అభివృద్ధి

## ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**భూపాలపల్లి, మహా :** గిరిజనుల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లి మండలంలో గొల్ల బుద్ధారం నుండి రాజునాయక్ కుంట, దూదేకులపల్లి నుండి రేగడిగుట్ట వరకు 4 కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు భూపాలపల్లి శాసనసభ్యుల గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం గొల్ల బుద్ధారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ తాను రాష్ట్ర మంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత గిరిజన తండాలు, ఆదివాసి వాడల అభివృద్ధికి 740 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టి మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్రాజెక్టులు చేపట్టినట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సంపన్నులు తినే సన్న బియ్యం నిరుపేదలు తినాలనే సంకల్పంతో చౌక ధరల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులతో పాటు నూతన రేషన్ కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణితో భూములకు హక్కులు లేక పట్టాలు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారని, ధరణితో ప్రజలు జీవనపాదులు సైతం కోల్పోయారని, గత ప్రభుత్వం పేదల పొట్ట కొట్టిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ధరణిని రద్దుచేసి భూ భారతి చట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిరుపేద గౌరవప్రదంగా జీవించాలని రెండు పడక గదుల ఇండ్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా 3,500 ఇండ్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గిరిజన, ఎస్సి, మైనారిటీ సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ ఉన్న వేతనాలు రెండు రోజుల్లో జమ చేస్తామని, ఎవరు ఆందోళన చెందొద్దని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి శాసనసభ్యులు కోరిన విధంగా నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. సమ్మక్క సారాలమ్మ జాతరను అంగరంగ వైభవంగా జరిపేందుకు 6 నెలల ముందు నుండి సమగ్ర కార్యచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

యూరియా కొరత గురించి మంత్రి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ వల్ల ఇతర దేశాల నుండి రావాల్సిన ముడి సరకు రాక కొరత ఏర్పడిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లి యూరియా కొరత లేకుండా చేస్తామని మంత్రి వివరించారు. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ అధికారం చేపట్టి 21 నెలల కాలంలో పేదల కష్టంలో భాగస్వాములు అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నీతి నిజాయితీగా రోజుకు 18 గంటలు పని చేస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన 8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేస్తున్నామని తెలిపారు. ప్రతినెల ఆర్టీసీకి 400 కోట్ల రూపాయలు చెల్లిస్తూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఆరోగ్యశ్రీని 5 లక్షల నుంచి 10 లక్షల పెంచి నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ కార్డు లేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. రేషన్ కార్డులు పంపిణీ అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 58 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గానికి 20 వేల ఇండ్లు కట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 26 లక్షల 70వేల మందికి రుణమాఫీ చేశామని తెలిపారు. ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ధరణి రద్దుచేసి 12 సంవత్సరాలు సేద్యంలో ఉన్న రైతులకు భూభారతి చట్టం ద్వారా అన్ని హక్కులు కల్పిస్తామని తెలిపారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతుబరోసా నిధులు మంజూరు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో రాళ్లు, రబ్బులు, కొండలకు సైతం రైతుబంధు నిధులు చెల్లించి 21 వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని తెలిపారు. మేడారం వెళ్లేందుకు కమలాపూర్ క్రాస్ నుండి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్య సేవలు.మెరుగు పరిచేందుకు సిటీ స్కానింగ్, వైద్య, సిబ్బంది పోస్టులు భర్తీ వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. పాఠశాలలకు అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. మహిళ ఆర్థికాభివృద్ధి కి కలెక్టరేట్ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయ సంఘాలకు ఆదాయం కల్పించేందుకు వ్యాపారాభివృద్ధికి ఇన్నోవేటివ్ ఐడియాలపై అవగాహన కల్పిస్తున్నామని, కొన్ని రోజుల క్రితం ఐడిఓసి కార్యాలయంలో వి హబ్ ద్వారా వ్యాపార అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మహిళా ఉత్పత్తులను బ్రాండింగ్ చేసేందుకు అవకాశాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో విద్యా, వైద్య రంగాలపై అత్యంత ఫోకస్ చేస్తున్నామని తెలిపారు. ఎస్డీఎఫ్ నిధుల ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బడికిరాని పిల్లలు ఉండొద్దని ప్రతి ఒక్కరికి విద్యను అందించేందుకు ఒక బాధ్యతగా, సవాలుగా తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మంత్రిగా భాద్యత లు చేపట్టి మొదటిసారి జిల్లాకు విచ్చేసిన మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ అధికారిని మల్లీశ్వరి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# జాగ్రత్తలు తీసుకుంటూ శ్రీ దేవీ నవరాత్రులు జరుపుకోవాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ మహా;** శ్రీదేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పని సరిగా నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ శాఖ వారు మహిళలు బతుకమ్మ ఆడేటువంటి ప్రాంతాల్లో, దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వేడుకలు జరిగే అన్ని ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అన్ని దుర్గామాత విగ్రహాలను జియో ట్యాగ్ చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఇళ్ల ముందు బతుకమ్మ ఆడతారు కాబట్టి బహిరంగ ప్రదేశాలు అవసరమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను చేయాలని సీపీ ఆదేశించారు.

# జీఎస్టి తగ్గింపు పై ప్రజల సంబరాలు

## జీఎస్టీ తగ్గింపు పై సామాన్య ప్రజలు హర్షం.. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ మహా;** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించి జీఎస్టి భారాన్ని తగ్గించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ జీఎస్టీ స్లాబ్ లను తగ్గిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. కొత్త జీఎస్టీ స్లాబ్ మంగళవారం నుండి అమలులోకి వచ్చిన సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎల్బీనగర్ ప్రాంతం లోని డీ మార్ట్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లను సందర్శించి వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకుంటూ వారి సంతోషాలలో పాలుపంచుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్టి అభియాన్ జిల్లా కన్వీనర్ రత్నం సతీష్ షా, కోకన్వీనర్ కుచన క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పూలెపాక మార్టిన్ లూథర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కొమాకుల నాగరాజు, డివిజన అధ్యక్షులు మామిడాల సతీష్, మహిళా మోర్చా నాయకురాలు బండి సుజాత తోపాటు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

## రెండు ఆటోలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, కిస్మత్పూర్ బ్రిడ్జి కింద, దారుణ హత్యకు గురైన మహిళా కేసును చేదించిన రాజేంద్రనగర్ పోలీసులు. ఈనెల 14 న మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మహిళ (32) హైదర్గూడాలో కల్లు తాగి స్పృహ కోల్పోయింది. లంగర్ హౌస్ కు చెందిన దుర్గారెడ్డి ( 33 ) ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని బీరు తాగించి బిర్యాని తినిపించి, సాతాంరాయిలోని నిర్మానుష్య ప్రాంతంలో లైంగిక దాడి చేసి, ఆరాంఘర్ పిల్లర్ నెంబర్ 306 వద్ద వదలి వెళ్ళిపోయాడు. టోలిచౌకి చెందిన దస్తగిరి,(26) మహమ్మద్ ఇమ్రాన్ (25) ఆమెను అద్దెకు తెచ్చిన ఆటోలో బలవంతంగా ఎక్కించుకొని కిస్మత్పూర్ బ్రిడ్జి కింది తీసుకెళ్లి లైంగిక దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని పొదల్లో పడేసి వెళ్లిపోయారు. సిసిపుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు కొనసాగించి నిందితులను గుర్తించారు. ముగ్గురు నిందితుల నుండి రెండు ఆటోలు 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోని రిమాండ్కు తరలించినట్లు రాజేంద్రనగర్ సీఐ క్యాస్ట్రో రెడ్డి మంగళవారం వెల్లడించారు.



# శ్రీ శృంగేరి శంకర మఠంలో శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాలు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

వరంగల్ తూర్పు నియోజకవర్గం శ్రీనివాస కాలనీలోని శ్రీ శృంగేరి శంకర మఠం లో శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం మహా దుర్గామాత విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ అభివృద్ధి పనులను శ్రీ సంగమేశ్వర జ్యోషి ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శృంగేరి శంకర మఠం సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాం, 32 డివిజన్ అధ్యక్షులు పొగాకు సందీప్ , మాజీ కూడా డైరెక్టర్ మోడం ప్రవీణ్, యువజన నాయకులు రాజు పటేల్, బైరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై హైకోర్టు ఆగ్రహం

## నష్ట పరిహారంపై మరోసారి కోర్టుకు మిడ్ మానేరు నిర్వాసితురాలు

## అసంతృప్తి వ్యక్తం చేస్తూ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హోం సెక్రటరీకి ఆదేశాలు



**హైదరాబాద్, మహా:** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మిడ్ మానేరు నిర్వాసితురాలు వనబట్ల కవితకు నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలను పక్కకు పెట్టి నష్ట పరిహారం చెల్లించకపోవడంతో సదరు నిర్వాసితురాలు మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల నిర్లక్ష్యానికి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే సదరు కలెక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హోం సెక్రటరీకి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. వెంటనే మిడ్ మానేరు నిర్వాసితురాలికి గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని తెలిపింది. అయితే కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అంశంపై ప్రిన్సిపల్ హోం సెక్రటరీకి ఆదేశాలు రావడంతో అతనిపై త్వరలోనే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# జిల్లా కోర్టులో సైకిల్, స్కూటర్ స్టాండ్ కు బహిరంగ వేలం

**హన్మకొండ మహా;** హనుమకొండ: హనుమకొండ జిల్లా కోర్టులో 202526 సంవత్సరానికి గాను సైకిల్, స్కూటర్, కారు స్టాండ్ నిర్వహణ అనుమతి కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సైకిల్ స్కూటర్ స్టాండ్ నిర్వహణకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు సూపరింటెండెంట్ ( అకౌంట్స్), ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్ట్ హనుమకొండ పేరున 27వ తేదీన మూడు గంటల్లోగా రూ. 1000 ని డిపాజిట్ చేసి అదే రోజున సాయంత్రం నాలుగు గంటలకు కోర్టు కాంప్లెక్స్ లో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నియమ నిబంధనల మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో వెల్లడించారు.

# అనుమతులు లేకుండా ఆసుపత్రులు నడపవద్దు : డిఎంహెచ్ఓ

**కాటారం, మహా :** అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రులను నడిపించవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్ అన్నారు మంగళవారం కాటారంలో ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేశారు. సాయి హాస్పిటల్, శ్రీ బాలాజీ హాస్పిటల్, అరవింద ప్రధమ చికిత్స కేంద్రం, లలిత క్లినిక్ తనిఖీలు చేశారు

జిల్లాలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఆసుపత్రిలో నడిపించవద్దని హెచ్చరించారు ఆర్ఎంపి వైద్యం పేరిట ఆసుపత్రులను కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ హెచ్చరించారు

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న సాయి హాస్పిటల్, శ్రీ బాలాజీ హాస్పిటల్, నోటీసులు జారీ చేశారు. తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని లేని పక్షంలో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఆర్ఎంపీ వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు అన్నారు అన్ని రకములైనటువంటి డాక్యుమెంట్లు కలిగి ఉండాలని, లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కడైనా చేసినట్లు సమాచారము తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. అనుమతి లేకుండా అబార్షన్లు చేయరాదు అని తెలియజేశారు

తప్పకుండా అన్ని ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని క్వాలిఫైడ్ డాక్టర్లు మాత్రమే వైద్యం అందించాలని హెచ్చరించారు లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుని ఆసుపత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెఓ డాక్టర్ శ్రీదేవి, ఎం ఓ కాటారం డాక్టర్ మౌనిక, పిఓ డాక్టర్ సందీప్, డెమో శ్రీదేవి, డి డి ఎం మధు పాల్గొన్నారు.

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 57.87 పాయింట్లు లేదా 0.070 శాతం నష్టంతో.. 82,102.10 వద్ద, నిఫ్టీ 32.85 పాయింట్లు లేదా 0.13 శాతం నష్టంతో 25,169.50 వద్ద నిలిచాయి. ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, బనారస్ బీడ్స్, బ్రాండ్ కాన్సెప్ట్స్, రెఫెక్స్ ఇండస్ట్రీస్, ఆటోమోటివ్ స్టాంపింగ్స్ అండ్ అసెంబ్లీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. అదానీ టోటల్ గ్యాస్, హరియోమ్ పైప్ ఇండస్ట్రీస్, శ్రద్ధ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, షా మెటాకార్ప్, ఎల్టీ ఫుడ్స్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

## జీఎస్టీ 2.0 ఎఫెక్ట్

### మొదటి రోజే భారీగా అమ్ముడైన కార్లు

జీఎస్టీ 2.0 ఎప్పుడెప్పుడు అమలవుతుందా.. కొత్త కార్లు ఎప్పుడు కొనుగోలు చేద్దామా అని చాలామంది ఎదురు చూశారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయి. దీంతో కార్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రావడంతో చిన్నకార్ల ధరలు చాలా వరకు తగ్గాయి. దీంతో కార్లను కొనుగోలు చేయడానికి వాహనప్రియులు ఎగబడ్డారు. కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన మొదటిరోజే.. మారుతి సుజుకి (Maruti Suzuki) 30,000 యూనిట్ల కార్లను విక్రయించి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (HMIL) సుమారు 11,000 కార్లను విక్రయించింది. టాటా మోటార్స్ (Tata Motors) కూడా 10,000 కార్లను విక్రయించింది. దేశంలో చిన్న కార్ల విక్రయాలు భారీగా పెరిగాయి. ఆటోమొబైల్ కంపెనీలు జీఎస్టీ ప్రయోజనాలను పూర్తిగా కస్టమర్లకు అందిస్తున్నాయి. రాబోయి రోజుల్లో కూడా ఈ సేల్స్ ఇలాగే కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా.. సోమవారం కార్లను కొనుగోలు చేయడానికి కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో డీలర్‌షిప్‌లకు తరలిరావడంతో, ఆటోమోటివ్ డీలర్ల రద్దీ పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (FADA) తెలిపింది.

# రెరాలో కొత్త టెక్నాలజీ..

# క్యూఆర్ కోడ్ తప్పనిసరి

## త్వరలో కియోస్క్ ప్రారంభం

## రెరా మొబైల్ యాప్ కూడా..

### గృహ కొనుగోలుదారులకు పారదర్శక, వేగవంతమైన సేవలు

### ఇప్పటివరకు టీజీ రెరాలో 10,043 ప్రాజెక్ట్‌ల నమోదు

**హైదరాబాద్:**

తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) సాంకేతికతను మరింత బలోపేతం చేయనుంది. గృహ కొనుగోలుదారులకు, పెట్టుబడిదారులకు పారదర్శక, వేగవంతమైన సేవలను అందించేందుకు సాంకేతికతను వినియోగించనుంది. ఇందులో భాగంగా టీజీ రెరా కార్యాలయంలో కియోస్క్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఎలాగైతే బ్యాంకింగ్ రంగంలో కియోస్క్‌లు చిన్నపాటి బ్యాంక్ అవుట్‌లెట్ లాగా పనిచేస్తాయో.. అదే తరహాలో కస్టమర్లు టీజీ రెరా సేవలన్నీ ఈ కియోస్క్ ద్వారా పొందే వీలుంటుంది. గృహ కొనుగోలుదారులు టీజీ రెరా కార్యాలయాన్ని నేరుగా సందర్శించే అవసరం లేకుండా టీజీ రెరా (TG RERA) ప్రాథమిక సేవలన్నీ ఈ కియోస్క్ ద్వారా అందుకోవచ్చని ఓ టీజీ రెరా అధికారి తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే దేశంలో రెరా కియోస్క్ ఏర్పాటు చేసిన తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

**టీజీ రెరా యాప్ కూడా..**

టీజీ రెరా మొబైల్ అప్లికేషన్ (యాప్)ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సాంకేతిక అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, ఏప్రిల్‌లో యాప్ అందుబాటులోకి వస్తుందని ఓ అధికారి తెలిపారు. దీంతో పాటు క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని టీజీ రెరా అధికారులు నిర్ణయించారు. నిర్దిష్ట ప్రాజెక్ట్ సమాచారమంతా ఈ క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తమై ఉంటుంది. ప్రాజెక్ట్‌కు బయట వీక్షకులకు కనిపించేలా క్యూఆర్ కోడ్‌ను (QR Code) డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు ప్రాజెక్ట్ డెవలపర్, ప్రమోటర్, అపార్ట్‌మెంట్ల సంఖ్య, అనుమతులు.. ఇలా ప్రాజెక్ట్ గురించి సమస్త సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. డెవలపర్లు ప్రాజెక్ట్ ప్రమోషన్, అడ్వర్టయిజింగ్ సందర్భాలలో క్యూఆర్ కోడ్‌ను తప్పనిసరిగా పబ్లిష్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే మహారాష్ట్రలో 2023 ఆగస్టులో మహా రెరా ఈ క్యూఆర్ కోడ్‌లను ప్రవేశపెట్టింది.




**10,043 ప్రాజెక్ట్‌ల నమోదు..**

2017 జులైలో మొదలైన టీజీ రెరాలో ఇప్పటి వరకు 10,043 ప్రాజెక్ట్‌లు నమోదయ్యాయి. 4463 మంది స్థిరాస్తి మధ్యవర్తులు, ఏజెంట్లు రిజిస్టరయ్యారు. అలాగే ఇప్పటివరకు టీజీ రెరాకు 2,340 ఫిర్యాదులు అందగా.. ఇందులో 1,566 ఫిర్యాదులను పరిష్కృతమయ్యాయి. సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్, జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వైవీఆర్ కన్‌స్ట్రక్షన్స్, సత్యనారాయణ మూల, శ్రీఅమేయా కన్‌స్ట్రక్షన్స్, శ్రీనివాస్ కాకర్ల ఏడుగురు ప్రమోటర్లు/ఏజెంట్లను డిఫాల్టర్లుగా గుర్తించారు. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే నివాస, వాణిజ్య ప్రాజెక్టలతో పాటు 8, అంతకంటే ఎక్కువ అపార్ట్‌మెంట్లు, నిర్మాణాలను టీజీ రెరాలో నమోదు చేసుకోవాల్సిందే.

## జియో పేమెంట్స్ బ్యాంక్ సేవింగ్స్ ప్రో





జియో పేమెంట్స్ బ్యాంక్ 'సేవింగ్స్ ప్రో' పేరుతో కొత్త సేవింగ్స్ ఖాతాను తీసుకొచ్చింది. ఇందులో మిగులు నిల్వలపై 6.5 శాతం వరకు వడ్డీ రాబడి పొందొచ్చని ప్రకటించింది. ఇందుకోసం కస్టమర్లు నిర్దేశిత మొత్తాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కనీసం రూ.5,000 లేదా అంతకుమించి ఉండొచ్చు. ఖాతాలో మొత్తం బ్యాలన్స్ కస్టమర్లు ఎంపిక చేసిన నిర్ణీత మొత్తం మించినప్పుడు, అదనంగా ఉన్న నిధులు ఓవర్‌నైట్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా మళ్లుతాయి. ఇలా ఒక ఖాతాదారుడు ఒక రోజులో గరిష్టంగా రూ.1.5 లక్షలను ఓవర్‌నైట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ (Invest) చేసుకోవచ్చు. అవసరమైనప్పుడు ఈ పెట్టుబడుల నుంచి 90 శాతాన్ని వెంటనే వెనక్కి తీసుకోవచ్చు. కాకపోతే ఇలా తక్షణం తీసుకునే మొత్తం రూ.50,000గా ఉంటుంది. మిగిలిన మొత్తం 1-2 రెండు రోజుల్లో బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. ఈ మొత్తాన్ని జియో ఫైనాన్స్ యాప్ నుంచి సులభంగా చేసుకోవచ్చు. జియో పేమెంట్స్ బ్యాంక్ ప్రస్తుత ఖాతాదారులు సైతం సేవింగ్స్ ప్రో ఖాతాకు అప్‌గ్రేడ్ కావొచ్చని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. ఇందులో ఎలాంటి ఎగ్జిట్ లోడ్, ఇతర చార్జీల్లేవని స్పష్టం చేసింది.

## పోయిందనున్న ఫోన్

### యూపీఐ సాయంతో దొరికిందిలా..




ఎక్కడైనా ఒకసారి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నామంటే.. దాన్ని తిరిగి పొందటం దాదాపు అసాధ్యం. అయితే ఓ జంట మాత్రం యూపీఐ సాయంతోనే పోయిన ఫోన్ పొందగలిగింది. ఇది వినడటానికి వింతగా అనిపించినా.. అసలు విషయం తెలిస్తే మాత్రం ఆశ్చర్యపోవడం మీ వంతు అవుతుంది. నా భార్య ఫోన్ తిరిగి పొందడంలో యూపీఐ సహాయపడింది అనే శీర్షికతో.. సోషల్ మీడియాలో ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. ఇందులో ఈ రోజు నేను, నా భార్య ఆటోలో షాపింగ్‌కి వెళ్ళాము, గమ్యం చేరుకున్న తరువాత.. ఆటోకు యూపీఐ ద్వారా డబ్బులు పంపించాను. ఆటో వెళ్లిపోయింది. ఆ తరువాత చూస్తే నా భార్య ఫోన్ కనిపించలేదు. ఆ ఫోన్‌కు కాల్ చేద్దామంటే.. అప్పటికి అందులో సిమ్ కార్డు వేయలేదు. మొదట్లో ఫోన్ ఎవరో దొంగలించి ఉంటారనుకున్నాము, తరువాత ఆలోచిస్తే ఆటోలో మారిపోయినట్లు గుర్తొచ్చింది. ఆటో డ్రైవర్ వివరాలు తెలుసుకుందామంటే.. స్కాన్ చేసి డబ్బు పంపించడం వల్ల అది సాధ్యం కాలేదు. మొత్తానికి ఫోన్ పోయింది అనుకున్నాము. ఇంతలో నా బ్యాంక్ ఖాతాకు ఒక్కరూపాయి యూపీఐ నుంచి వచ్చింది. అంతే కాకుండా పోయిందనుకుంటున్న ఫోన్ నా దగ్గర ఉంది అని.. ఒక నెంబర్ పంపి, దానికి కాల్ చేయమని మెసేజ్ వచ్చింది. మేము ఆ నెంబరుకు కాల్ చేసి.. ఎక్కడ ఉన్నారు అని కనుక్కున్నాం. కానీ ఆ ఆటో డ్రైవర్ మా దగ్గరకు వచ్చి ఫోన్ ఇచ్చాడు. మా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఆటో డ్రైవరుకు కొంత డబ్బు కూడా ఇచ్చి పంపాను అని రెడ్డిట్ పోస్టులో వెల్లడించారు.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL




## ట్రంప్‌నకు హమాస్ రహస్య లేఖ?



మధ్యప్రాచ్యంలో మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొల్పేందుకు కొత్త దారులు తెరుచుకుంటున్నాయి. 24 మంది బందీల విడుదలతో పాటు 60 రోజుల కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు హమాస్ రహస్య లేఖ పంపినట్లు సమాచారం. మరోవైపు, గాజా యుద్ధం ముగింపునకు శాంతి ప్రణాళికను ట్రంప్ సిద్ధం చేసినట్లు పలు వార్త కథనాలు వెల్లడిస్తున్నాయి. దోహాలో ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసిన తర్వాత గాజా శాంతి చర్చలు నిలిచిపోగా.. ఈ పరిస్థితుల్లో ట్రంప్‌తో హమాస్ సంప్రదింపులకు ప్రయత్నం చేస్తోంది. అయితే, ట్రంప్ బృందం ఈ విషయంపై స్పందించలేదు. కాగా, గాజా నగరంపై గట్టి పట్టున్న హమాస్‌తో అమీతుమీ తేల్చుకుంటామంటూ భారీగా సైనికులను రంగంలోకి దించిన ఇజ్రాయెల్ ఆర్మీ.. దాడుల తీవ్రతను కొనసాగిస్తోంది. శుక్రవారం (సెప్టెంబర్ 19) రాత్రి నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ గాజా వ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో సుమారుగా 43 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో గాజా నగరంలోని షావా స్క్వేర్ సమీపంలో జరిగిన దాడిలో ఐదుగురు, మరో దాడిలో ఒకే కుటుంబంలోని ఆరుగురు చనిపోయారు. గత 23 నెలలుగా ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా సాగిస్తున్న దాడుల్లో చనిపోయిన వారి సంఖ్య 65,100 దాటిపోయింది. భవనాలను నేలమట్టం చేస్తుండటంతో గాజా ప్రాంతంలో ఉన్న కనీసం 90 శాతం మంది పాలస్తీనియన్లకు నిలువ నీడ కూడా లేకుండాపోయింది. దాదాపు సగం మంది, అంటే సుమారు 4.50 లక్షల మంది గాజా నగరాన్ని వీడి వెళ్లిపోయినట్లు పాలస్తీనా సివిల్ డిఫెన్స్ విభాగం తెలిపింది. ఇలాఉండగా, గాజా ప్రాంతంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వేలాది మంది చిన్నారుల కోసం తీసుకువచ్చిన అత్యవసర ఆహార పదార్థాలున్న నాలుగు ట్రక్కులను సాయుధులు వచ్చి తరలించుకుపోయారంటూ యునిసెఫ్ పేర్కొంది.

## ట్రంప్.. మీ కోసం నన్ను రోడ్డుపై నిలబెట్టేశారు



ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఎమాన్యుయెల్ మాక్రోన్ ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన 80వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ (UNGA) సమావేశానికి హాజరయ్యారు. ఆయన ఫ్రెంచ్ ఎంబసీకి వెళ్తున్న సమయంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాన్వాయ్ రోడ్డులో ప్రయాణిస్తున్నందున, న్యూయార్క్ పోలీస్ మాక్రోన్ వాహనాన్ని తాత్కాలికంగా ఆపేశారు. ఈ ఘటనలో మాక్రోన్ తన కారులో నుంచి బయటకు వచ్చి, ట్రంప్‌కు ఫోన్ చేశారు. 'ట్రంప్.. ఏమైందో గెస్ చేయండి.. నన్ను రోడ్డుపైనే మీ పోలీసులు ఆపేశారు. మీ కాన్వాయ్ వస్తున్నందున నన్ను ఇక్కడే నిలిపేశారు' అంటూ సరదాగా ట్రంప్‌తో వ్యాఖ్యానించారు. అనంతరం మాక్రోన్ నడుచుకుంటూ సమావేశానికి హాజరయ్యారు. కేవలం పాదచారుల కోసం మాత్రమే రోడ్డును తెరవడంతో అది మాక్రోన్‌కు కూడా తప్పలేదు. మాక్రోన్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ ప్రజలతో పోటోలు తీసుకుంటూ యూఎన్‌జీఏ ఎంబాసీకి వెళ్లారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

## ఏడు నెలల్లో ఏడు యుద్ధాలు ఆపాను..



**వాషింగ్టన్:** ఐక్యరాజ్యసమితి సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. అమెరికా అధ్యక్షుడిగా కేవలం ఏడు నెలల కాలంలో ఏడు యుద్ధాలు ఆపాను. అందుకే తన పరిపాలన స్వర్ణయుగం అంటూ అభివర్ణించారు. అమెరికా న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి 80వ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ ప్రసంగించారు. 'ఇజ్రాయెల్ ఇరాన్, భారత్‌పాకిస్థాన్, రువాండా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, థాయిలాండ్‌కంబోడియా, అర్మేనియా అజర్‌బైజాన్, ఈజిప్ట్ ఇథియోపియా, సెర్బియా కొసావో దేశాల మధ్య అంతులేని యుద్ధాల్ని ముగించా. కొన్ని యుద్ధాలు 31 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. మరికొన్ని 36ఏళ్లుగా కొనసాగుతున్నాయి. అలాంటి అంతులేని యుద్ధాల్లో నేను ఏడు యుద్ధాలు ఆపాను. మరే ఇతర అధ్యక్షుడు వాటిని ఆపే ప్రయత్నం చేయలేదు. కానీ నేను వాటిని ఆపాను. భారత్‌పాక్ యుద్ధాన్ని కూడా నేనే ఆపా. ప్రపంచ దేశాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్నా. ప్రజల ప్రాణాలు కాపాడటమే నాకు అసలైన నోబెల్ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితిపై విమర్శలు గుప్పించారు. యుద్ధాలు ఆపడంలో ఐక్యరాజ్య సమితి ఘోరంగా విఫలమైంది. ఐక్యరాజ్యసమితి తన ప్రాముఖ్యతను కోల్పోయింది. దేశాల మధ్య యుద్ధ సమస్యల్ని పరిష్కరించేలా సహాయం చేసేందుకు ప్రయత్నించలేదు. ఐక్యరాజ్యసమితి తన సామర్థ్యాన్ని కోల్పోయింది. ఐక్యరాజ్య సమితివన్నీ ఒట్టి మాటలే. ఆ ఒట్టి మాటలు యుద్ధాల్ని ఆపలేవు' అని ట్రంప్ అన్నారు.

## నో టికెట్.. నో మనీ

### విమానం ల్యాండింగ్ గేర్ పట్టుకుని ఢిల్లీకి వచ్చిన ఆఫ్ఘన్ బాలుడు



'విపత్కర పరిస్థితులనుంచి ఎలాగైనా ప్రాణాలను కాపాడుకోవాలి. బతికి బట్ట కట్టాలి'' ఈ ఆరాటానికి నియమాలు, కట్టుబాట్లు ఇవేవీ గుర్తు రావు. ఈ ధిక్కారమే ఒక ఆఫ్ఘన్ బాలుడి (Afghan Boy) సాహసోపేత చర్యకు దారి తీసింది. ఏకంగా విమానం ల్యాండింగ్ గేర్‌కు వేలాడుతూ ఢిల్లీ దాకా వచ్చేశాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రమాదమని తెలిసినాసాహసానికి పూనుకున్న 13 ఏళ్ల తెగువ ఇపుడు నెట్టింట చర్చనీయాంశంగా నిలిచింది. కాబూల్ నుండి ఢిల్లీకి (KabulDelhi) కామ్ ఎయిర్‌లైన్స్ విమానం RQ4401 లో ఆదివారం(సెప్టెంబర్ 22) ఉదయం 11.10 గంటలకు 1.5 గంటల ప్రయాణం తర్వాత ఢిల్లీలో దిగిపోయాడు. విమానం కాబూల్ నుండి ఢిల్లీకి గంటన్నర ప్రయాణం పూర్తిచేసుకుని ల్యాండ్ అయిన తరువాత అధికారులు ఈవిషయాన్ని గ్రహించారు. టాక్సీవేపై నడుస్తున్న బాలుడిని గుర్తించి ఎయిర్‌లైన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో అధికారులు విస్తుపోయారు. బాలుడ్ని అదుపులోకి తీసుకుని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (CISF) సహా భద్రతా సంస్థలకు అప్పగించారు. కుందూజ్ ప్రాంతానికి చెందిన ఈ బాలుడు సెక్యూరిటీ కళ్లు గప్పి ఎయిర్‌పోర్ట్‌లోకి చొరబడి విమానం బయలుదేరే ముందు రియర్ సెంట్రల్ ల్యాండింగ్ గేర్‌లోకి ఎక్కి దాక్కున్నట్టు అంగీకరించాడు. అంతేకాదు విమానం అటు ఇటు కుదుపులకు గురైనప్పటికీ వేలాడుతూ అలాగే ధైర్యంగా ఉండిపోయినట్లు చెప్పాడు. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా చేరాడు. అయితే మైనర్‌బాలుడు కావడంతో ఎలాంటి చర్యలు లేకుండానే మరో విమానంలో తిరిగి కాబూల్‌కు పంపించివేశారు అధికారులు. గడ్డ కట్టే చలి, తీవ్రమైన గాలులు లాంటి వాతావరణం మధ్య ఆ బాలుడు ఎలా తట్టుకున్నాడు? అల్పోష్ణస్థితి , హైపోక్సియా , అధిక ఎత్తులో తక్కువ వాతావరణ పీడనంతో ఎవరైనా చనిపోవాల్సిందే అని కొందరు, ఇది స్టోరీ మాత్రమే కాదు, ప్రాణాలకు తెగించి పారిపోవాల్సి భయానక పరిస్థితులకు అద్దం అని కొందరు వ్యాఖ్యానించారు. కాగా గతంలో కూడా ఇలాంటి ఘటనలు కొన్ని వెలుగు చూశాయి. ప్రపంచవ్యాప్తంగా "వీల్‌వెల్ స్టోవేవే'' అని పిలుస్తారు.

## భారత్ మాకు ఎంతో ముఖ్యం.. సంబంధాలు కీలకమే: అమెరికా

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 80వ సమావేశం సందర్భంగా.. జైశంకర్, మార్కో రుబియో భేటీ అయ్యారు. భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు చర్చించారు. ఈ పరిణామంపై రుబియో స్పందిస్తూ.. భారత్ అమెరికాకు అత్యంత కీలక భాగస్వామి. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, ఔషధాలు, కీలకమైన ఖనిజాలు.. తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి. ఇరు దేశాల అభివృద్ధికి ఈ సహకారం అవసరం. భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం చేయడం ద్వారా రెండు దేశాలకు అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛా, ఓపెన్ విధానాన్ని ప్రోత్సహించేందుకు భారత్‌తో కలిసి పనిచేస్తాం అని పేర్కొన్నారాయన. మరోవైపు.. రుబియోతో భేటీపై జైశంకర్(Jaishankar) స్పందిస్తూ.. మార్కో రూబియోతో సమావేశం సానుకూలంగా సాగింది. అయితే ప్రాధాన్య అంశాలపై మరిన్ని చర్చలు అవసరం అని పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం భారతపై విధించిన సుంకాలు, H1B వీసా ఫీజు పెంపు వంటి పరిణామాల తర్వాత జరిగిన తొలి సమావేశం ఇదే. ఇప్పటికే అమెరికా ప్రతినిధుల బృందం భారత్‌కు వచ్చి సంప్రదింపులు జరిపి వెళ్లిపోయింది. ప్రస్తుతం కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో బృందం వాషింగ్టన్‌లో వాణిజ్య చర్చలు జరుపుతోంది. నవంబర్ కల్లా వాణిజ్య ఒప్పందాన్ని పూర్తి చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. ఈ సమయంలోనే రుబియోజైశంకర్ భేటీ జరగడం, ఇరు దేశాల మధ్య సంబంధాలు తిరిగి బలపడేలా వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మహా పత్రిక
W W W. ... O M | సినిమా వార్తలు | NEWS | బుధవారం, హైదరాబాద్ | 24-09-2025
ANN తెలుగు



# అవకాశాల వేట

సినిమా ఎవరిని ఎప్పుడు అందలం ఎక్కిస్తుందో తెలియదు. అందుకే అవకాశం వచ్చినప్పుడే దాన్ని సద్వినియోగం చేసుకోవాలంటారు. అలా ఉప్పెన చిత్రంతో టాలీవుడ్‌లోకి వచ్చిన నటి కృతిశెట్టి(Krithi Shetty). ఈ కన్నడ భామ వాస్తవానికి 17 ఏళ్ల వయసులోనే నటిగా రంగప్రవేశం చేశారు. అలా తొలుత సూపర్ 30 అనే హిందీ చిత్రంలో నటించారు. తరువాత తెలుగులోకి ఉప్పెన చిత్రంతో దిగుమతి అయ్యారు. ఈ చిత్రం అనూహ్య విజయం సాధించడంతో మరో ధ్రువతార వచ్చిందని అందరూ అనుకున్నారు. అన్నట్లుగానే తెలుగులో శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు చిత్రాల్లో నటించి వరుసగా విజయాలను అందుకున్నారు. ఆ తరువాతనే కథ అడ్డం తిరిగింది. తెలుగులో తను నటించిన చిత్రాలు ఫ్లాప్ కావడంతో మలయాళం, కన్నడం, తమిళం భాషలపై దృష్టి సారించారు. అలా మలయాళంలో నటించిన ఏఆర్ఎం అనే చిత్రం ఈ బ్యూటీకి మంచి పేరే తెచ్చి పెట్టింది. అయితే ద్విభాషా చిత్రం పేరుతో ది వారియర్, కస్టడీ చిత్రాలతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ రెండు చిత్రాలు పూర్తిగా నిరాశపరిచాయి. ఎంత ఉప్పెనలా ఎట్రీ ఇచ్చారో ఇప్పుడు అంత చప్పగా ఈమె కెరీర్ సాగుతోంది. కృతిశెట్టికి ప్రస్తుతం మలయాళం, కన్నడం, తెలుగు భాషల్లో ఒక్క చిత్రం కూడా లేదు. తమిళంలో మాత్రం మూడు చిత్రాలు చేతిలో ఉన్నాయి. రవిమోహన్‌కు జంటగా నటించిన జీనీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. అదేవిధంగా కార్తీకు జంటగా నటించిన వా వాద్దియార్ చిత్రం నిర్మాణాంతర కార్యమాల్లో ఉంది. కాగా ప్రదీప్ రంగనాథ్‌తో జత కట్టిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. ఈ మూడు చిత్రాలపైనే నటి కృతిశెట్టి కెరీర్ ఆధారపడి ఉందని చెప్పవచ్చు. దీంతో ఈ అమ్మడు అవకాశాల వేటలో పడ్డారు. అందుకు అందరు హీరోయిన్ల బాటలోనే గ్లామరస్ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసి దర్శక నిర్మాతల దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారు. అవకాశాల సంగతి ఏమోగానీ, ఇప్పుడు ఆమె గ్లామరస్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.




# 107 మిలియన్ వ్యూస్..

## కాంతార చాప్టర్ 1 ఖాతాలో సరికొత్త రికార్డు!


2022లో రికార్డు సృష్టించిన 'కాంతర' చిత్రానికి ప్రీక్వెల్‌గా రాబోతున్న చిత్రం కాంతార: చాప్టర్ 1. తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదలైన సంగతి తెలిసిందే. తెలుగులో ప్రభాస్, హిందీలో హృతిక్, మలయాళంతో పృ థ్వీరాజ్, తమిళ్‌లో శివకార్తికేయన్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఇప్పటికే ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ట్రైలర్ రిలీజ్ తర్వాత ఆ అంచనాలు మరింత పెరిగిపోయాయి. ట్రైలర్ విజువల్ వండర్ ఎక్స్ పీరియన్స్ ఇస్తూ ప్రేక్షకులుని కాంతారా ప్రపంచంలోకి తీసుకెళ్ళింది. ఇక ఈ ట్రైలర్ అనేక రికార్డులు సృష్టిస్తోంది. 24 గంటల వ్యవధిలో ఈ ట్రైలర్ అన్ని భాషలు కలిపి 107 మిలియన్ డిజిటల్ వ్యూస్ తో పాటు 3.4 మిలియన్ లైక్స్ సాధించి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ మూవీలో రిషబ్ శెట్టి సరసన యువరాణి పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనుంది. గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను దర్శకుడిగా రిషబ్ శెట్టి ఒక దృశ్య కావ్యంలా తీర్చిదిద్దుతున్నారు. అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాకి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. హోంబలే ఫిలింస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. అక్టోబర్ 2న కన్నడతో పాటు హిందీ, తెలుగు, మలయాళం, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# అమ్మానాన్న వదిలేశారు

## ఆ మాట అస్సలు అనలేదన్న హీరోయిన్!

సినిమా తారలపై రకరకాల రూమర్స్ వస్తుంటాయి. వాళ్ల సినిమాలతో పాటు పర్సనల్ విషయాలపై కూడా నెట్టింట గాసిప్స్ చక్కర్లు కొడుతుంటాయి. అయితే చాలా మంది నటీనటులు వాటిని పెద్దగా పట్టించుకోరు. అవసరం అయితే తప్ప స్పందించరు. అయితే ఆ అబద్దం నిజమని నమ్మినట్లుగా తెలిస్తే మాత్రం వెంటనే ఖండిస్తారు. తాజాగా నటి కల్యాణి ప్రియదర్శన్(Kalyani Priyadarshan) అదే పని చేశారు. తనపై మీడియాలో వచ్చిన ఓ పుకారుని తీవ్రంగా ఖండించారు. తనను, తన సోదరుడిని తల్లిదండ్రులు వియత్నాంలోని అనాథశ్రమంలో వారం రోజుల పాటు వదిలి వెళ్లారని.. జీవితం అంటే ఏంటో తెలియాలనే ఉద్దేశ్యంతో అలా చేశారని కల్యాణి చెప్పినట్లుగా ఓ సినీ వెబ్‌సైట్ వార్తలను రాసుకొచ్చింది. ఈ విషయం కళ్యాణి దృష్టికి వెళ్లడంతో..ఆమె తీవ్రంగా ఖండించారు. ఇలాంటి మాటలను నేనెప్పుడు అనలేదని..దయచేసి ఇకపై అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కాగా, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కూతురే ఈ కల్యాణి. 'హలో' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'చిత్రలహరి'తో మంచి విజయాన్ని అందుకుంది. ఇటీవల ఆమె నటించిన 'కొత్త లోక' చిత్రం బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఆగస్ట్ 28న విడుదలైన ఈ చిత్రం ఇప్పటి వరకు రూ. 270పైగా వసూళ్లను సాధించింది.. మలయాళంలో అత్యధిక వసూళ్లను రాబట్టిన చిత్రగా నిలిచింది.





# నిషేధ చట్టాన్ని ఉల్లంఘించిన రణ్‌బీర్ కపూర్‌పై చర్యలు

బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ చిక్కుల్లో పడ్డారు. నిషేధ చట్టాన్ని ఆయన ఉల్లంఘించారని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చర్యలకు సిద్ధమైంది. షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ దర్శకత్వం వహించిన తొలి సిరీస్ బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ లో రణ్‌బీర్ కపూర్ అతిథి పాత్రలో నటించారు. అయితే, ఒక సీన్‌లో ఈసిగరెట్‌తో ఆయన కనిపిస్తారు. భారత్‌లో ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం ఉంది. దీనిని ఆయన ఉల్లంఘించారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేర్కొంది.

బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్‌తో పాటు చిత్రనిర్మాతలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై చట్టపరమైన చర్యలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సిద్ధమైంది. భారత్‌లో నిషేధించిన ఉత్పత్తులను నెట్‌ఫ్లిక్స్ ఎలా చూపించిందంటూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారిచేసింది. ఈ సిరీస్‌లో రణ్‌బీర్ కపూర్ ఎటువంటి చట్టబద్ధమైన హెచ్చరిక లేకుండా ఈసిగరెట్ తాగుతున్నట్లు చూపించారని లీగల్ రైట్స్ అబ్జర్వేటరీ దాఖలు చేసిన ఫిర్యాదులో పపేర్కొన్నారు. నిషేధిత పదార్థాలను ఇలా ప్రోత్సాహించడం నేరం దాని ద్వారా యువతను తప్పుదారి పట్టించేలా ప్రభావితం చేస్తుందని తెలిపారు. అయితే, ఈ వివాదం జరిగిన కొద్ది సేపటికే ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో స్పందించారు. 'భారతదేశంలో ఈసిగరెట్‌లు నిషేధం. ఇక్కడి చట్టం ప్రకారం ఏ వ్యక్తి కూడా ఈసిగరెట్లను ప్రోత్సహించకూడదు. ఎవరైనా భారత్‌లో వాటిని విక్రయించినా లేదా దిగుమతి చేసుకున్నా నేరం. కనీసం ఎలాంటి అమ్మకాలు జరిపేందుకు అనుమతి లేదు. రణ్‌బీర్ కపూర్‌తో పాటు నిర్మాణ సంస్థ, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాని ముంబై పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం' అని చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com